శ్రీ

చింతామణి.

ఇది మాసమునకొకసారి ప్రకటింపఁబడును.

రాజమహేంద్రవరము
సంపుటము ౨] నందనసంవత్సర ఆశ్వయుజమాసము.(Oct: 92.) [సంచిక ౪.

సుభాషితరత్నావళి.(౧౦౪-పుట శేషము.)

కృతికర్తవంశావతారాభివర్ణనము.

సీ॥ పరమేష్ఠితుల్యప్రభావుండు వాధూలుఁడను ఋషీంద్రుండొప్పుననఘమూర్తి।
యమ్మునినాథువంశమ్మున క్షీరాంబునిధి సుధాకరుఁడు జన్మించినట్లు।
ప్రభవించి శ్రీశైలిపాటి సింగనమంత్రివంశాగ్రగణ్యుఁడై వరలునతని।
మహిమసంతానక్రమమునను జలపాలసచివుఁడొప్పె బలారిసచివసముఁడు।
గజపతిక్షితిభర్తచే గజముతోడ।
నగ్రహారములతఁడు పరిగ్రహించె।
నెలమి నేనుఁగువారన్నయింటిపేరు।
గలిగె నతనికి గజలాభగరిమవలన॥

గీ॥ ఈడ్య గజపతిదత్తసోమేశ్వరాగ్ర।
హార శాసనుఁడయ్యు మహాసారభాగ్య।
మహిమగలిగిన జలపాలమంత్రిమణికి।
గరికిరాజు జనించె విఖ్యాతయశుఁడు॥

క॥ సరసుఁడగు గరికిమంత్రికిఁ।
బురుహూతోపేంద్రసములు పుట్టిరితనయుల్।
గురుమూర్తియు గురురాజును।
శరణాగత భరణనిపుణ సద్బిరుదాంకుల్॥

ఉ॥ ఆయతభోగవాగ్జితబలారిగురుఙ్ గురురాజు దానరా।
ధేయు నజేయు వత్సవయ తిమ్మమహీశ్వర రాజ్యభార ధౌ।
రేయు నుతింపఁగాఁదగువరిష్ఠ గజాశ్వసుఖాసనాది ల।
క్ష్మీయుతు దేవహాస సరసీవన సత్కృతిధర్మకర్మఠుఙ్॥

ఉ॥ సారదయామరస ద్రుహిణసారథికిన్ గురురాజమంత్రికిన్।
పేరమయందు నందనుఁడు పేర్మి జనించె విలాససంపదన్।
మారుఁడు విక్రమంబునఁగుమారుఁడు లక్ష్మణశౌరి భూరిశో।
భారవి సాహితీ విజితభారవి ధీరవిపారవిశుభ్రితిన్॥
ఉ॥ దండిమనోజ్ఞ శబ్దకవితాధురి చే సుషమాసమృద్ధి చే।
కొండవకాళిదాసు రసరీతితరంగితసూక్తిఁగుండలిం।
ద్రుండనిధీరు లెంచఁగఁ గృతుల్ రచియించిన ధన్యునిన్ మహా।
పండితమాన్య నెన్నఁదగు భాజితసూర్యునిలక్ష్మణార్యునిన్॥
గీ॥ కృతులొసఁగి వత్సవయ తిమ్మనృపతిచేతఁ।
దురగమణి భూషణాంబరాందోళికాది।
పూజనైకొని పెద్దాడపురవరాను।
శాసనుండయి లక్ష్మణశౌరిదనరె॥
క॥ అఘనుఁడు గాంచె దానఘ।
నాఘనుల సుభద్రయందు నందనులగుణ।
శ్లాఘార్హుఁ దిమ్మనార్యుని।
రాఘూటసమాఖ్యు గురువరాజ సమాఖ్యున్॥
వ॥ అందు.
శా॥ తిమ్మామాత్యుఁడు మేరుభూధరమహాధీరుండు రాజాధిరా।
ట్తిమ్మక్ష్మారమణ ప్రసాదశుభవర్ధిష్ణుండు విద్వత్సభా।
సమ్మోదావహ వాగ్విలాస విబుధాచార్యుండు దిక్కామినీ।
ధమ్మిల్లాభరణద్యశోవిశద ముక్తాదాముఁ డెన్నన్ దగన్॥
క॥ ధీరమతి తిమ్మనార్యుఁడు।
పేరమయనఁదగిన సతిని బ్రేమవరించెన్।
. శ్రీరమణీయాకృతియగు।
శ్రీరమణీమణిని హరివరించిన కరణిన్॥
మ॥ అనఘస్వాంతుఁడు మాచిరాజునరసింహార్యుండు మల్లమ్మయున్।
జనకుండున్ జనయిత్రి గాఁగ మిహికాశైలేంద్రుఁడున్ మేనయున్।
జనకుండున్ జనయిత్రి గాఁదగు మహేశప్రియసంభోళిత।
మ్మనమంత్రీశ్వరు రాణియై వెలయు పేరాంబన్ నుతింపన్ దగున్॥
చ॥ అతులితకీర్తి పేరమకు నంచితప్రఖ్యుఁడు తిమ్మమంత్రికిన్।

సుతులము సంభవించితిమి సుస్థిరశంకరభక్తి భావనా।
చతురుఁడనంతధీమణియు సన్నుత లక్ష్మణనామధేయ వి।
శ్రుతుఁడను నేను శంభువరశోభితభద్రుఁడు వీరభద్రుఁడున్॥

క॥ గౌరీపరిణయకావ్యము।
సూరీంద్రులు మెచ్చఁ జెప్పి శుంభత్కవితా।
పారీణబిరుద మొందిన।
భూరియశోఘనుఁడనంత బుధవరుఁడలరున్॥

సీ॥ అయ్యనంతుండు సుందరియందు సుతులఁ
గాంచె నిరుపురసౌజన్య కలితమతుల।
ధరణినాయక పూజ్యుని గురువఘనుని।
ధీరజనహిత గుణధుర్యుఁ దిమ్మనార్యు॥

గీ॥ మాన్యుఁడయిన గురువమంత్రికిఁ బట్టస।
వీరభద్రదేవు విపులకరుణ।
వలన నుద్భవించె వర్ధిష్ణుఁడైన వీ।
రేశ్వరుండు సుజనహితుఁడు సుతుఁడు॥

క॥ చతుర జనంబులు లక్ష్మీ।
పతియనలక్ష్మణుఁడనంగఁ బరగిననాకున్।
సుతులై వర్ధిల్లిరి సం।
భృతవినయులు తిమ్మశౌరి పేరయ ఘనుఁడున్॥

గీ॥ తిమ్మనార్యుండు పార్వతీదేవియందుఁ।
బార్వతీశ్వరు వరముచే భాగ్యయుతుల।
సుతులఁ గాంచెఁ జిరాయురున్నతులవీర।
భద్రలక్ష్మణమంత్రుల బంధుహితుల॥

వ॥ ఏవంవిధ విభవమహనీయ మదీయవంశ సంభవులగు వారికెల్ల సకల మనోరథఫలప్రద పారిజాతంబగు నమ్మహేశ్వరునకు—

షష్ఠ్యంతములు.

క॥ శ్రీమంతునకుఁ ద్రిలోకీ।
సామంతున కరుణచరణ జలజ రజోగా।
జీమంజుల సిందూర।

శ్రీమానిత పదనివేశ సీమంతునకున్॥

క॥ శివునకు గిరిజాధవునకు।
భవునకు నిర్దగ్ధభావభవునకు సద్వై।
భవునకు శిక్షితవలినో।
ద్భవునకు మునిదత్త పరమపద విభవునకున్॥

క॥ నీహార హీర సురతటి।
నీహారపటీర తార నిభ దేహునకున్।
మోహాధిపవాహునకని।
లాహారాంగద లసన్మహాబాహునకున్॥

క॥ స్థాణునకు దానవాంతక।
బాణున కభయప్రదాన పరిపాలిత గీ।
ర్వాణునకు వేదమయ కం।
ఖాణునకు నిశాట ఘనజగత్త్రాణునకున్॥

క॥ హరునకుఁ బెద్దాడపురీ।
శ్వరునకు నక్షత్రకుసుమసంగత చికురో।
త్కరునకు మందస్మిత సుం।
దరునకు సోమేశ్వరునకు నమదమరునకున్॥

వ॥ భక్తిసమర్పితంబుగా నారచియింపఁబూనినసుభాషితరత్నావళియను చాటు ప్రబంధంబునకుఁ బ్రారంభఁబెట్టిదనిన॥—కో-రా-వేం-కృష్ణరావు.

నీ తి క ధ లు .



కప్పలు రాజునుకోరుకొనుట.

చెఱువులలోను గుంటలలోను విచ్చలవిడిగాతిరుగుచు సుఖముగానుండియొక

నాఁడు కప్పలన్నియు నొకచెఱువువద్దఁ జేరి యఱచుచు సభచేసి తమకురాజు కావలెనని యింద్రుని ప్రార్థించెను. ఇంద్రుఁడు వానిప్రార్థనవిని పైనుండి యొకదుంగను చెఱువునడుమగుభిల్లుననీటిలో పడవేసి, అదియే మీరాజని చెప్పెను. అంతయెత్తునుండి పడినప్పుడు పయికిలేచిననీరుచూచి తమరాజెంతబలవంతుఁడోయని భయపడి, కప్పలు మొట్టమొదట సమీపమునకుఁ బోవుటకే జడియుచు భయభక్తులు కలిగియుండెను. కాని యటుతరువాత తమరాజు కదలమెదలక యొకచోటనే యుండుటచూచి కొంత భయముతీఱి కప్పలు మెల్లమెల్లఁగా సాహసించి దానిసమీపమునకుఁ బోసాఁగెను. అప్పుడును తమరాజు కదలమెదలకుండుటచూచి యందొకటి దానిని పరమసాధువునుగా భావించి తాఁకిచూచెను; మఱియొకకప్ప దానిని తాఁకినను భయములేదనుకొని మీఁదికి దుమికెను. అటుతరువాత నొకటొకటే కప్పలన్నియు దానిమీఁద నెక్కి నిర్భయముగా నాటలాడసాఁగెను. ఈప్రకారముగాఁ గొన్నిదినములు జరగిన తరువాత తమకింద్రుఁడు మంచిరాజునియ్యనందున కతృప్తికలవయి, కప్పలుమరలసభచేరి తొంటికంటె ద్విగుణముగా నఱచుచు తమకు దుంగరాజు పనికిరాలేదనియు చుఱుకుఁదనముగల రాజును ప్రసాదింపవలయుననియు తమరొద లాకాశమంటునట్లు మరల నింద్రుని ప్రార్థించెను. అప్పుడింద్రునకు తఱుచుగా తనకు తొందర కలుగఁజేయుచున్నందునకయి వానిమీఁద కోపమువచ్చి, వానికి రాజునుగా నొకకొంగరాజును బంపెను. ఆబకేంద్రుఁడు తనకు రాజ్యమురాఁగానే యపరిమితసంతోషముతో వచ్చి ప్రజలమీఁదపడి కావలసినన్ని కప్పలను యథేచ్ఛముగా ప్రతిదినమును భక్షింపసాఁగెను. ఇట్లు తమమొఱ్ఱనాలింపక దొరకినవాని నన్నిటినిపట్టి భక్షించుచుండఁగా నానాటికి పలచనయి తమరాజునకగుపడకుండ మూలమూలల దాగుచు, ఇంకను గొన్నాళ్ళీరాజేయున్నపక్షమునఁ తమకు ప్రళయము సంభవించునని భయపడి, కప్పలన్నియు రహస్యముగా నొకచోటఁ జేరి క్రూరుఁడయిన యీరాజును దీసివేసి వేఱొకరాజు ననుగ్రహింపవలయుననియు, లేనియెడల వెనుకటిరాజునే మరల ప్రసాదింపవలయుననియు, బహువిధముల నింద్రునిఁ బ్రార్థించెను. అప్పుడింద్రుఁడు వానిప్రార్థనల నంగీకరింపక మీరుకోరితెచ్చుకొన్న రాజును తొలఁగింపఁగూడదనియు స్వయంకృతాపరాధఫలము ననుభవింపవలసినదనియు చెప్పి పంపివేసెను.

గీ॥ క్షితితలంబునఁ దమమంచిస్థితినిగూర్చి
తృప్తినొంద కత్యాశవహించియెపుడుఁ
జాలవృద్ధప్రయత్నముల్ సలుపువారు
పెక్కుకష్టంబులను దెచ్చిపెట్టికొంద్రు.

అమితత్వము.

గీ॥ మృత్యుదేవత యాత్మీయభృత్యులందు
నొక్కరికి మంత్రిపదమియ్య నూహచేసి
కొలువులో సింహపీఠికఁ గూరుచుండి
తనదు పరివారమును జీరియనియెనిట్లు—

గీ॥ "భృత్యవరులార! మీలో నహీనశక్తు
నొక్కరుని నాకు మంత్రిగా నొనరుచుకొనఁ
దలఁచియున్నాను, మీసమర్థతలు చెప్పి
తెలుపుకొనుఁడర్హులెవరొ మంత్రిత్వమునకు."

గీ॥ అనఁడు జ్వరరాజు ముందుకునరుగుదెంచి
"దేవి! నేనెయర్హుండ మంత్రిత్వమునకు.
స్వామిభక్తిచే నీభృత్యవర్గమందు
నెవ్వరును నాకు సరిరారు పృథివిలోన."

గీ॥ "మొదలనొక్కింత యవకాశమొదవఁగానె
వెంటనేపట్టుకొని పిల్చిపిప్పి చేసి
జనుల వేలకొలంది నీసన్నిధికిని
బంపుకొనుచుందు నేఁబ్రతివత్సరంబు."

గీ॥ అనిన వాతరోగుఁడు వచ్చియనియెనిట్లు—
"అమ్మ! ఆత్మసంస్తుతి యనర్హంబయైన
నన్ను నేనిప్డు చెప్పకొనంగవలసె.
నీప్రధానత్వమునకేనె నిపుణతముఁడ."

గీ॥ "కాలుమొదలు తలవఱకుఁ గీలుకీలు
నవశముగఁజేసి మర్త్యుల నహరహంబు
ప్రభ్వికడకెందఱినొ నేనుబంపుచుందు
సర్వదేశంబులందును సంచరించి."

గీ॥ ఇంతలో వచ్చి సుఖరోగుఁడిట్టులనియె—
"రాణి! మంత్రిత్వమనకేఁబ్రవీణతముఁడ.
నీరువారునువలె వృద్ధవితతికడకు
నీచగతి నొక్కఁడుయుప్పుడు నేనుబోను."

గీ॥ "వయసులోనున్నవారినై వడిగఁజేరి
చెఱిచి రక్తంబు నంగముల్ కొఱికివేసి
ప్రతిదినము లక్షలకొలంది పడుచువాండ్రఁ
దఱుముచున్నాఁడ నీసన్నిధానమునకు."
గీ॥ శ్వాసకాసాదులైనట్టి వ్యాధిరాజు
లెల్లనొక్కరొక్కరె వేగ నేగుదెంచి
వరుసవెంబడి నాత్మప్రభావములను
విన్నపములుచేసి కొనిరి వేర్వేరతాము.
గీ॥ మృత్యుదేవియు సభనిట్లు భృత్యులెల్లఁ
జేసికొన్నట్టి మనవులు చిత్తగించి
మంత్రిపద 'మమితత్వశర్మ'కు నొసంగి
యఖిల భృత్యులకిట్లని యానతిచ్చె—
గీ॥ "ఆప్తవరులార! తాపజ్వరాదులార!
జాగరూకులు మిమ్మెల్ల శత్రువులుగ
నెంచి దరికిరానీరు; రానిత్తురేని,
తఱుచుగా మిమ్ము వైద్యులు తఱుముచుండ్రు"
గీ॥ "ఇంకనీ యమితత్వమో యెల్లరకును
ప్రాణమిత్రమైయుండును; ప్రజలు తెచ్చి
కొందు రమితత్వశర్మనుగోరి తారె;
చేరి సుఖమిచ్చుచునె ప్రజఁజెఱుచునితఁడు."
గీ॥ "మొదల నమితత్వఁడేగి తాఁబూనకున్న,
మీకు నెవ్వారికిని బనిలేకయుండు;
మీకుఁ బనిపెట్టి మిమ్మేలుమేటిగాన
నీతనికె ప్రధానత్వ మేనియ్యవలసె."
గీ॥ పుడమిలో వ్యాధులమితత్వమూలమున నె
పెక్కులెల్లవారికి సంభవించుఁగాన,
నన్నపాన సంభోగ నిద్రాదులెప్పుడు
ప్రజలు మితముగా ననుభవింపంగవలయు.

"OUR DUTY TO OUR FILTHY NEIGHBOURS IN SOUTHERN INDIA."

(౧౪౮ - వుట శేషము.)

How to provide funds— ఈపనులన్నియు జేయుటకు సొమ్ముకావలెను. చాలకాలమునుండి చెన్నపురి గవర్నమెంటువారు సొమ్ములేక యీపనులను చేయించినారుకారు. ప్రతిసంవత్సరము వీనికొరకీయబడిన సొమ్మయినను అక్కరకువచ్చు విధమున కర్చుపడుటలేదు. ఈకారణముచేత మనకిప్పుడుచేసిన కర్చుకనుపించునుగాని లాభమేమియు గనుపించదు. స్యానిటెరీ సర్వేయయినతరువాత నిన స్పెక్టర్లను నియమించినతరువాత చేసెడి కర్చుకు తగినలాభము కనుపడును. ఎవ్వరెటులుచెప్పినను ముందుముందు దేశమభివృద్ధినొందును. ప్రస్తుతము మనము డబ్బంతయు నగలక్రింద వినియోగపర్చుచున్నాము. దీనిచేత సొమ్మంతయు మూలపడిపోయి యెంతమాత్రమును లాభకారిగాకున్నది. ఈసొమ్ములో గొంతభాగమైనను మ్యూనిసిపాలిటీలకు స్వల్పవడ్డికి నిచ్చినయెడల కావలసినపనులన్నియు సులభముగ జరుగును. ముందుముందు డబ్బు నగలమూలముగా నిర్వియోగమయి పోనేరదు. ప్రజల నాగరికత హెచ్చినకొలది నిటువంటి యాచారములు నశించును. ఇరువదవ శతాబ్దమువచ్చువరకనగా నిక నిరువది సంవత్సరముల కిటువంటి యాచారములు కనుపించవు.

Lessons from nature herself—లోకములో వృద్ధిక్షయము లెప్పుడు నొక్కరీతిగానే జరుగును. పచ్చిక చెట్లు మొదలగువానిని జంతువులు తినును. ఈజంతువులు మాంసము భక్షించు నితరజంతువుల కాహారమగును. ఈజంతువులపెంట కళేబరములు చెట్లకు బలముచేసి వృద్ధిచేయును. లోకములో నిత్యమును జరుగునదిచూచియే మనమెరివివేసి మొక్కలను పెంచుచున్నాము. ప్రకృతికి వ్యతిరేకముగా మనమేమియు జేయగూడదు. అట్లు చేసినయెడల తప్పక చెరుపు కలుగును. కాబట్టి మనము ముఖ్యముగా పట్టణములయందు పెంటమొదలగునవి నిలువనియ్యక ఎరువిక్రింద పొలములలో నుపయోగపర్చవలె. అట్లు చేయక మనము పేక్ష చేసినయెడల పెంటకుళ్లనారంభించి యందులోనుండి దుర్గంధసహితమైన విషవాయువులు బయలుదేరి పలువిధములైన తెగుళ్ళుపుట్టి మనశరీరారోగ్యమునకు మిక్కిలి చెరుపును గలుగజేయును. ఇట్టివిషవాయువులవలన వమనవిరేచన జాడ్యములు మొదలగునవి వ్యాపించి, ప్రాణనాశముకూడ కలిగించును. వేయేల? మనముశుభ్రముగానుండినయెడల విశేష సౌఖ్యము గలుగును. అట్లుండనిచో రోగము, అసౌఖ్యము, అకాలమరణమును సంప్రాప్తమగును.

13 చిత్రపు - వేంకటాచలము.

ప్రభావతీప్రద్యుమ్నము, ద్వితీయాశ్వాసము. (౧౧౬-పుట శేషము.)

క॥ అకలుష నీలిమనా కా న్యక కచమున కోడి పాఱినవి నైయె తేఁటుల్।
మకరందార్థము తలుచుగ వికచ౦ బలగు పుష్పములకె వెదకుచు నేగుక్॥ ౬౬॥

గీ॥ చంద్రభీతఘనధ్వాంత సంచయమున కభయ మొసఁగి వేణీభరంబు నెపమునఁ
దన వెనుక వేసికొన్నది తరుణి మొగము చంద్రుఁడై కొనమి కిదియ సాక్షిగాదె॥

క॥ కాంత తరఘాల సంస్థిత కంతు విజయలేఖపట్టికా విన్యస్తా
ద్యంత శ్రీకారములన నెంతయు నాయింతి పీను లింపెసలారుక్॥ ౬౮॥

చ॥ తిలకము సంపింతోర్ధ్వముఖ తీక్ష్ణశరాగ్రము గాఁగ నాసికా
చలవిలసత్ప్రకోష్ఠ సుమసాయకముష్టి గృహీతమధ్య శా
ర్ఙలతయనక్ బొమల్ దనరఁగా నిరుఁగొమ్ముల ప్రేలువెల్ల జ
ల్లులగతి నవ్వుడాలు వాదలుక్ మదిరాక్షి మెఱుంగుఁ జెక్కులక్॥ ౬౯॥

ఉ॥ అంబురుహాక్షి నాసిక నిజాన్వయ శత్రువుఁ జంపకప్రసూ
నంబుఁ గరంబు గెల్చుట ఘనంబునఁ బెట్టి తదీయపార్శ్వ యు
గ్మంబున నిత్యసేవకతఁ గ్రాలెడు నీక్షణతారకాఖ్య రో
లంబక దంపతుల్ పెనుచళావళి నెంతయు సంభ్రమింపుచుక్॥ ౭౦॥

ఉ॥ బింబఫలోష్ఠి కన్నులను జేడిసనీ లిరుదిక్కులక్ సమా
నంబుగఁ బర్వుచున్న శ్రుతినామ సరోయుగ శోభలిట్టు ల
ట్టుంబడియుపీను సేకుఁగఁగడుక్ దమినెందుకుఁగాక రెంటిమ
ధ్యంబునఁ బాటెడిం బరువులారయుఁ జాపలమట్టి దేకదా॥ ౭౧॥

గీ॥ కలయ నాపాంగ మస్తకాంగములఁ జుండు మించిపటలీలఁదరళతో వంచితము గు
యువతిలావణ్యమును గన్నగవయునతను దంటమీల జెక్కియమనఁదనరుఁజూడ॥

ఉ॥ ఎప్పుడు భక్తభావమున నింపలరక్ ద్విజరాజు పాదముల్
దప్పక సేవచేయు సుకృతంబునఁ గాంచెఁ జకోరయుగ్మమీ
యొప్పన నొప్పఁగన్నులవి యోలిని గ్రోలిన తేటవెన్నెలల్
చిప్పిలినట్లు మించు సతి లేనగవుక్ దెలినిగ్గుఁ జూపులుక్॥ ౭౩॥

ఉ॥ సావరమాధురి స్పృహపసంబికమో శుకమో తదీయ జి
హ్వావిలసత్స్వరస్వాశి సుపాసన చేయుచు నగ్రభూమి నిం
పావహిలంగి నేర్చి యుపహారముగా నిడినట్టి పల్లవం
బో విమలంపు బింబఫలమో యన వాతెఱయొప్పు నింతికిక్॥ ౭౪॥

క॥ మగువయధరంబు పగడమునఁ జిగురును బింబమును బంధుజీవకమును గ
ట్టిగ గెల్చి కన్నసత్కీర్తి గతిన్ సాంద్రమణి మరీచి పెలుంగుక్॥ ౭౫॥

గీ॥ మృదుల పవనాహతిన్నొకింత గదలియాడు।
పల్లవము మాటునను దోఁచు మొల్లమొగ్గ।
చాలుగతిఁ బల్కుబడి మోవిచాటునఁ గనఁ।
బడుచు నింతిపల్వరుస కన్నార్యింతి పఱుచు॥ ౭౬॥

క॥ చెలువపలుకమృతరసములు। గులుకుట వీనులకె కాదు కోమలదంతా।
వళిరుచియును శీకరపుం। జెలినిగ్గునఁ గన్నులకును దెల్లమచూడన్॥ ౭౭॥

గీ॥ కనకకర్ణికాధారాళి కాంతులదికి। బాహులతికలు బిరుసుసంపంగిదండ।
లిరుఁగడల వ్రేలవైచిన కరణిఁబరగఁ। గంబువిజయము పచరించుఁ గాంతగళము॥

క॥ ఖరకరకరభిన్నములై। కరమెలమి వహించు నరుణకమలంబులతోఁ।
బురడింపఁదగునె గొజ్జఁగ। విరితేకుల బంతిగములు వెలఁదికరంబుల్॥ ౭౯॥

గీ॥ జిలుఁగుఁబయ్యెదయను వలలోన నాచెల్వ। గుబ్బచనుఁగవయను కోకయుగళి।
యెగయఁజనఁగురీతి నెసఁగుఁ గ్రేవలఁ జల। తృష్ణలీల మెఱుఁగుఁ దరఁగలడర॥ ౮౦॥

గీ॥ చారుతర నాభియనెడు గంభీరసరసిఁ। గడఁగి క్రీడించు మరునిశృంగారరసపుఁ।
జిమ్మనపుఁగ్రోవి ధారనాఁ జెన్నుమీఱుఁ। బడఁతినూగారు కన్నులపండువగుచు॥

చ॥ తనుతర రోమవల్లరికిఁ దా నిరువంకలఁ గల్గులేను నా।
ననయము సూక్ష్మసూక్ష్మముగ నజ్జలజానన కౌనుమించి లో।
చనముల కింపొనర్చుఁ గడుసన్నపుఁ గారుమెఱుంగుదీఁగె చ।
క్కని నిడుబీటవాటి కనఁగాఁబడు నట్లతియత్నదృశ్యమై॥ ౮౨॥

క॥ చనుఁగవ వ్రేఁగున గిటుగిటు। మను నెన్నడు మేమియగునొ యని యొడిశంకన్।
గనకపుఁ గట్టిడినాఁడో। వనజాసనుఁ డనఁగ వనిత వళులింపెసఁగున్॥ ౮౩॥

గీ॥ నెన్నడిమి పేరిమింట నన్నెలఁత బొడ్డు। పొన్నవిరి నిక్కముగఁ జూచి చిన్నఁబోదు।
రభ్రికుసుమసౌరభ సాధనార్థహేతు। వాశ్రయాసిద్ధమని యొడి యయ్యలెల్ల॥ ౮౪॥

చ। సుకవులు క్రిందుమీఁ దరసిచూడక యూడని యాసుకొన్న హా।
టక కదళీవిలాస మకటా విపరీతముగాక సాటియే।
యకలుష రామణీయక సమంచితకోమల తద్వధూరు ల।
క్ష్మికి సరిగావయెంత తలక్రిందయినన్ గరిరాజహస్తముల్॥ ౮౫॥

గీ॥ రమణిజంఘలు శాలిగర్భములఁ హీర। దీప్తి జలపూర్తినొప్పు నందియలుమళ్ళ।
వానిలోపలఁ జలువకై వచ్చియున్న। కచ్ఛపంబులఁ బోలి మీఁగాళ్ళుదనరు॥ ౮౬॥

క॥ కెందామరలుఁ జిగుళ్ళును। సౌందర్యశ్రీలఁ దమకు సరిగావని యా।
యిందుముఖి పాదములు నగుఁ। గందళదుజ్జ్వల నఖాంశు కైతవయుక్తిన్॥ ౮౭॥

శా॥ శృంగగ్రాహికఁ జెప్పవేటె తెరువుల్ సిద్ధింపమిం జేసి చి।
త్రాంగశ్రీనిధి నవ్వధూమణిని స్థూలారుంధతి న్యాయమా।
ర్గాంగీకారమున౯ వచించితిని జంద్రాద్యుపమ ల్వాచనా।
భంగుల్గాని యథస్సహస్రగుణ సౌభాగ్యంబులాయంగముల్॥ ౭౮॥

ఉ॥ వెన్నెల తేటసిగ్గు నరవిందపుతేరు మృదుత్వముం బదా।
ర్వన్నియ జాళువాపసిఁడి రంగుమెఱుంగుల ధాళధళ్యము౯।
గన్నియరూపుగాఁ గరువుగట్టి మనోజుఁడు పోఁతఁబోయఁబో।
లున్నెఱ నేర్పుతోననుట లోకులపల్కది చాలదేమియు౯॥ ౭౯॥

ఉ॥ ఎమ్మెయిఁ బ్రజ్ఞ మీఱ వచియించెదనన్న వచింపలేన య।
క్కొమ్మ మెఱుంగులోన నొక కోటితమాంశమునైన నంతమా।
త్రమ్మ మదుక్తిశక్తి యనరాదతివాఙ్మహిమాఢ్య నేను మా।
యమ్మ సరస్వతీసతి తనంతటిదానిఁగ నన్నుదిద్దుట౯॥ ౮౦॥

వ॥ అని తాను బ్రహ్మదేవుని రథవాహనంబైన సారంధరుండను హంసవంశావతంసు కూఁతురగుటయుఁ దదీయసంబంధవశంబున నంబుజాసను రాణివాసంబునందు వాణి పెంపఁ బెరుగుటయుఁ దదనుగ్రహంబునం దనకు నఖిలవిద్యలుం గరతలామలకంబగుటయుం జెప్పి మన్ముఖంబు శబ్దసంస్కారపూతంబగు బుద్ధి నద్దేవియ నాకు శుచిముఖియను పేరిడియెనని యిట్లనియె॥ ౮౧॥

చ॥ నలినజు రాణివాస మొకనాఁడు ననుం దనచేతిప్రోది రా।
చిలుకను వాదుకుం గవితచెప్పఁగఁ దా నియమించి యందు నా।
పలుకులఁ గొంత వాసిగని భావమునం గడుమెచ్చుచు న్నఖాం।
తరమున నాదుఱెక్క నలిచక్కఁగ దువ్వుచు గారవించుచు౯॥ ౮౨॥

చ॥ ప్రబలములైన కౌతుకకృపారస వత్సలతాదరంబుల౯।
శబలితచిత్తయై యపుడు నాకుపమాతిశయోక్తి కామధే।
ను బిరుదమిచ్చి తల్లిఖిత నూపురము న్భువనైకమాత య।
య్యబల మదంఘ్రిఁ దాఁ దొడిగె నా బిరుదంబిది చూడు మేర్పడ౯॥ ౮౩॥

క॥ అని నిజనూపురగత వర్ణనికాయముఁ ద్రిప్పిచూపి నారాయణ నం।
దన యిట్టి నాదుపలుకులకు నగమ్యము దనుజకన్యకామరూహింపక౯॥ ౮

వ॥ ఆజగన్మోహనాంగిం జిత్రఫలకంబున వ్రాసియైనం జూపెదనం జేని॥ ౮

... నాయంగరాదు చేసిన ...

వ॥ అదియునుంగాక॥ ౯౭॥

క॥ అత్తరుణీమణి రూపము। చిత్తరువున వ్రాయునేర్పు చేకుఱునే నిజ।
దత్తుల్య వనిత యెందే। నత్తీరులు వేలుపు సృజింపఁ డాతనసృష్టిన్॥ ౯౮॥

గీ॥ అజుఁడె యొకప్రసంగమై చెప్పవింటి నీకాంతయతనిసృష్టి గాకునికియు।
నాదిశక్తి శివమహాదేవి తనదైన। చిత్రమహిమచే సృజించుటయును॥ ౯౯॥

క॥ వినుమిప్పుడది సంస్మృతిపద। వినిపెంచెను మాటమాటవెంబడి నెంచెన్।
ననుభవ భవసంస్కారం। బునకుద్బోధము ప్రసంగమున నగునకటా॥ ౧౦౦॥

మ॥ దనుజేంద్రాంగన కంబికావర మహత్త్వస్ఫూర్తి నాలోకమో।
హనజన్మించుటవింటి వెండియుఁ దదంగాలౌకిక శ్రీప్రవ।
ర్తనమూహించిన నట్లరెంటికిఁ గడున్ దాక్షిణ్యమేర్పడ్డ మనం।
బున కిట్లిప్పుడు సంస్కృతంబయిన యంభోజాత జాతోక్తియున్॥ ౧౦౧॥

క॥ వినుము ప్రభావతియన నావ్వనితామణి నామ మర్థవంతమ్ముగుచున్।
దనరారుచుండు ననయంబును యదుకులకలశ జలధిపూర్ణశశాంకా॥ ౧౦౨॥

గీ॥ ఆప్రభావతి తనకలనగజవచ్చి। వ్రాసిదయనిచ్చెనని యొక్క రమ్యపురుషుఁ।
జిత్రఫలకాభిలిఖితు నెచ్చెలియుఁ దానఁ। గరము వేడుకఁజూడ నేఁగంటి ననఘ॥

క॥ ఆకన్నప్రతిమ సుద్దులు। మాకు మునుప్పు కలిమిఁజేసి మహానీయా తద్।
యాకృతిపోలు పంతయు భవ। దాకృతిఁగని యతఁడి యితఁడ యనుకొంటి మొగిన్॥

వ॥ అని పలికి మాకునిక్కడ మిక్కిలిం దడయుట యుచితంబుగాదు పోయివచ్చెద
మనుప నవధరించితే యనుచుఁ దోడియంచలుం దాను నప్పుడుగుచెలువ యుప్పర
వీథి కెగసె నప్పు డమ్మరాళంబు లరాళంబులుగాక యాకాశభాగంబున గమన
వేగంబునం దీఁగసాగిన బాగుమెఱయు నిజగరుత్కనకరేఖామయూఖంబు లాఖం
డలారిదిక్కునకు నక్కజంపు మెలమింగొనలువారి యుద్దీపించు ప్రద్యుమ్న ప్ర
తాప వైభవంబునుం బోలెఁ జాల నాలోకనీయంబు లగుచుండఁ దత్పరస్పర
తదీయ కీర్తిమూర్తివిశేషంబులోయన సోయగంబున మీఱి గగనమంతయుం గబ
ళించుటకు నొక్కకడకు నొత్తుకొనిపోవ గారలుచాచిన చందంబున నిస్పంద ప్ర
సారితంబులైన తనూరుహంబులతో కంజూడ నొప్పారుచు నప్పుడప్పటికి నవిరళ
రసస్పర్శ నుభయపార్శ్వభాగ పాండురబలాహకంబుల నహంకృతి పెక్కువ
గాఁ కలపించుటకుం బిలుచుభంగి సంఘటిల్లు సల్లసిల్లు పక్షయుగళ వి
[illegible] సుద్యోగించుచు నా॥

యుతమయమలంపుఁ జెలిదళుకుఁ జికి యది మలయజ పుఁ గలయంపి వెలువు
నలవరింప నందుఁ గుందనంపు రంగవల్లికా మతల్లికల యుల్లాసంబు వెల్లిగొలుపు
గురుదంతకాంతివల్లరులచేత నతిశయిల్లుచు నాక్కొక్కచోట నొండొంటిసంధు
న సందర్శనీయంబులగు నభోవిభాగంబులవలన నస్థాన భానుసంభవా సంభేద
సంభృత శబలతావిలాస భాసురసురాపగా ప్రవాహసందేహ కందళనంబులకు
ననుగుణంబయిన పరపున నిడుపొంజాలు గట్టి యిట్టట్టు చెదరక చదలనడచుచు
వజ్రపురంబు చేరి తోంటియట్ల సకలజలాశయంబుల విహరించుచుండె నందు శుచి
ముఖి కన్యాంతఃపుర సరోవిహారసమయంబుల॥ ౧౦౫॥

సీ॥ జలఖేలదంగనా కలకలంబులకు మిక్కిలి దవ్వుతాఱక నిలిచినిలిచి।
పడఁతు లొక్కరొకళ్ళపైఁ జల్లు జలభిందు లొడలఁ సోఁకిఁ బోక యొర్చి యొర్చి।
యోలలాటల తమి నొండొరుఁ దఱుముచెవ్వఁ ధాక కులుకక మెలఁగి మెలఁగి।
లీలావతీహస్త లీలాబ్జకేసరంబులకును బసిగొంచు మలసిమలసి।
క్రమముతోడ దనుజకన్యకాంతఃపుర। కాంతలకును బెదర కింతఁ గాక।
చేరికలఁ బరించు టారూఢిఁగా నల। వాటు చేసికొని యొఁ బాటవమున॥ ౧౦౬॥

శా॥ ప్రద్యుమ్నుండను ప్రభావతీ రుచిరరూపబ్రహ్మముల్ హంస యో।
షిద్యాథార్థ్య ధురీణవాగుపనిష త్సిద్ధాంత మార్గాను సా।
రోద్యత్ప్రజ్ఞను బల్మఱుల్ మననసంయుక్తంబు గావించుచుఁ।
హృద్యంబై యది యంతకంతకలరన్ నిల్పెం గడుఁ జిత్తమున్॥ ౧౦౭॥

సీ॥ కనఁడొద్దనున్నవారిని వీరువారని కనినఁ దదర్హా వర్తనలు మఱచు।
వినఁడు చెప్పినపల్కు వేమఱుఁ జెప్పక వినిన నేమేమంటి రనుచు నడుగుఁ।
జనఁ డెత్తులిడక మజ్జనముఖ్యవిధులకుఁ జనినఁ దబ్బిబ్బుగాఁ జలుపుఁ గ్రియలు।
కొనఁడు నానాసేవకుల సేవ లెవ్వియుఁ గొనినవీడ్పాటుగాఁ బనులు పనుచు।
శుచిముఖీ వాక్యదర్పణస్ఫురితనిరుప। మానదనుజేంద్ర కన్యకామణిమనోజ్ఞ।
రూపరేఖావిలాస సంరూఢమైన। యాత్మ మరలింప నేరక హరిసుతుండు॥ ౧౦౮

ఉ॥ ఉద్యదపేక్షుపక్షి వనితోక్తుల వెంబడిఁ జంచరీక చం।
ద్రాద్యుపమాన శోభకు సహస్రగుణంబుగ హెచ్చఁ గేశవ।
క్త్రాద్యఖిలాంగలక్ష్మి మదికందిన యంతయునున్ ఘటించి యా।
హృద్యతరాంగి మూర్తి సొబగెల్ల నొకింతగఁ జూచు నాత్మలోన్॥ ౧౦౯॥

చ॥ మదిగొని నంత మేరయును మానకతం డుపమానకోటి యొ।
ప్పిద మఖిలంబునిట్లు గడుఁ జెక్కుచు డుంగులుగాఁ దలంచి త।

త్తదవయవత్వ సుస్థితిఁ దార్పఁగ నమ్మదిరాక్షిరూప మే।
య్యదియ్యదియే కనంబడియె నచ్చపుబుద్ధికి దేవగమ్యముల్ ॥ ౧౧౧॥
సీ॥ ఆరూపు మదిఁజాల హత్తించుహత్తించి యతివ యిట్టిది గాక యనుచు మెచ్చు।
మెచ్చి కన్గొనుకోర్కె హెచ్చించుహెచ్చించి యంతమే లెట్లబ్బు ననుచు వగచు।
వగచి నిట్టూర్పులు నిగుడించు నిగిడించి తదవలోకము లేని బ్రదుకు రోయు।
రోసి దానికుపాయ మూహించు నూహించి కలఁకనేమియు దొరకమికిఁ గుందుఁ।
గుంది తలపోఁతలకు మదిఁ గొల్లవిడుచు। విడిచి దరిదాపు లేమిఁ జెన్నేతలమునుఁగు।
మునిఁగి యెవ్వరు పిలిచినఁ గనియు మిగుల। హరిసుతుండు ప్రభావతీవిరహవశత॥
శా॥ ధీమంతుండు పటుప్రతాపనయ మైత్రీనిత్య నమ్రీభవ।
త్సామంతుండు సుకీర్తిమౌక్తిక మణిస్రగ్భూషితాశావధూ।
సీమంతుండు విపక్షమంత్రి ముఖరాజీవప్రభోచ్చాటనా।
హేమంతుండు నిజస్తవానుకలనా హ్రీమంతుఁ డత్యంతమున్॥ ౧౧౨॥
క॥ అబ్జాంబావరుఁ డఖిల కళాకుబ్జాంభవ గమ్యకీర్తికుఁడు నళినీప।
త్రాబ్జందుసమ ప్రకృతి। తబ్బోధమయాత్మ తత్త్వకోవిదుఁడు మహిన్॥ ౧౧౩॥
తరల॥ కుముదబంధునిభుండు పింగళి గోకమంత్రి యశఃకథా।
సముదనల్పసభుండు వైదికశాస్త్రసింధు నిరంతర।
ప్రమథనాత్తశుభుండు సంతతభక్తియుక్తి సమర్చిత।
ప్రమథలోకవిభుండు విత్తరంకుశ ప్రతిభుండిలన్॥ ౧౧౪॥
గద్యము॥ ఇది నిఖిల సూరిలోకాంగీకారతరంగిత కవిత్వవైభవ పింగళి యమరనార్య తనూభవ సౌజన్యజేయ సూరయనామధేయ ప్రణీతంబయిన ప్రభావతీప్రద్యుమ్నంబను మహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము॥

ప్రభావతీప్రద్యుమ్నము.

తృతీయాశ్వాసము.

క॥ శ్రీమద్భక్తివిశేష। స్థేమావిశ్రాంతవిహిత శివతత్త్వకథా।
మీమాంసుఁడు పింగళి యమ। రామాత్య వతంసుఁ డపరహంసుఁడు దీప్తిన్॥ ౧॥

వ॥ హరికుమారుం డొక్కనాఁ డేకాంతవర్తియు హస్తవిన్యస్త గండస్థలుండు నగుచు నిట్లని తలపోయం దొడంగె॥ ౨॥

చ॥ కలుగునొకో కనుంగవకుఁ గాంతఁ గనుంగొను భాగ్య మెక్కడన్।
గలిగెడుఁ దత్పురంబు చొరఁ గల్గియు దొడ్డటుఁ జొచ్చి చూడఁగాఁ।
గలిగిన నవ్విలాసవతిఁ గౌఁగిటఁ జేర్పక యోర్పు టెట్లు నా।
తలఁపు బడిం దదాత్మయును దారొక్కన కెట్లది సంఘటిల్లెడున్॥ ౩॥

చ॥ శుచిముఖిమాట యొం డరసి చూడఁగ నెంతయు నాసపా టొన।
ర్చుచు మదిఁ ద్రిప్పుచున్న యది చూడ్కికి నన్నె పోలువానినా।
రుచిరతరాంగి చిత్తరువు రూపొకటన్ రహిఁ జూడఁ జెప్పెఁ ద।
ద్వచనము చొప్పు నేమి నియతంబు సమాకృతు లెందుఁ గల్గవే॥ ౪॥

చ॥ ఇది పదిలంబుగా నడుగ కేనపు డక్కట కోర్కి దాచి వ।
ట్టి దొరతనంపు నీటు ప్రకటించితిఁ బాపపు లజ్జ నన్ను నో।
రదిమెన నాదరంబు తెఱఁగైయది హంసికిఁ బోఁచెనేమొ ని।
ల్వద మఱి యించుకైన గరువల్పవిగాని కథల్వచింతురే॥ ౫॥

ఉ॥ ఏనొక యించుకంత మనసిచ్చినమాటలు పల్కకుండఁగాఁ।
గాని మరాళి యద్దనుజకన్యకకై నను నొత్తిచూచి యే।
మైన ననంగఁ బూనెనని యాత్మకుఁ దోఁచుచు నున్నదిప్డు కా।
దేని ప్రసంగ ముందిగిచి యేల నుతించుఁ దదీయరూపమున్॥ ౬॥

మ॥ అటు గాకద్భుత రామణీయక గుణాఢ్యంబైన సద్వస్తువున్।
బటువాచారసికుల్ ప్రసంగమయినన్ బారంబు ముట్టన్ రసో।
త్కటతం జెప్పక మానఁ జాల రనుపక్షం బొందఁ భావించినన్।
ఘటియిల్లున్ వనితాంగ వర్ణనకు నిక్కం బన్యథాసిద్ధియున్॥ ౭॥

చ॥ హరియును వాసవుండుఁ దమునంపిన కార్యము హంసి తానరయై।
థరణికిడిగ్గి చెప్పి మదుదగ్ర మనస్స్థితిఁ గాంచు నెన్న నా।

సురరిపుఁజంప నన్ననవు సుద్దులుపుట్టఁగఁబోలు నెల్లెడన్ ।
సరసిజనేత్రు దక్షిణభుజంబవు నీవని పల్కనందునన్ ॥ ౭ ॥

ఉ॥ అన్నియు నేకవాక్యముగ నారయ నాసలు పెంచుపత్త్రమే ।
యున్నది కొంతమించి యిది యోజనసేయఁగ నాదురూపె యా ।
కన్నియ చేతి చిత్రఫలకంబున నున్నది యెవ్వరట్టిచో ।
నన్ను నెఱింగి వ్రాయననినన్ శివ వ్రాయుటవింటిఁ జొప్పడన్ ॥ ౮ ॥

సీ॥ శివ నన్ను వ్రాసియిచ్చినపత్త్రమునను లేఖననిమిత్తము వేఱకలుగునొక్కొ ।
కలుగదంతఃపుర కన్యకెట్టిది భర్తృపరతఁదక్క ఘటిల్లుటరుదుగాన ।
నది యట్లయైనను దదభీష్టయువ పరీక్షామాత్రఫలకమై జాఱునొక్కొ ।
జాఱదీశ్వరియిచ్చె సత్కృపననిబాల వేడ్కఁజూచుటఁ జెప్పవింటిఁగాన ।
నిట్టిగతిఁ జెల్వకునుమ పెద్దపెట్టునొక్కొ ।
పెట్టదది దాసృజించిన బిడ్డగాన ।
బొంకగుచు నంతకిదియు ద్రోపువడునొక్కొ ।
పడదజుఁడు చెప్పెనని వినఁబడియెఁగాన ॥ ౧౦ ॥

చ॥ మును తనసృష్టి కామి నలుమోములవేలుపు చెప్పవింటినే ।
ననుచు మరాళిపల్క నపుడక్కట యే నడుగంగలేన యే ।
మనినను దిట్టుకొందు నజుఁడట్టి ప్రసంగపువేళ నవ్వరా ।
ననకు విభుం డితండతఁడనన్ వినఁబడ్డది యేమిగల్గెనో ॥ ౧౧ ॥

ఉ॥ మాపిరి నవ్విలాసవతి వార్తలపట్టున నెన్నియెన్ని ప్ర ।
శ్నావసరంబులైన నాకయర్థము నేనడుగంగలేమి ని ।
చ్చావిను ఖండితండని ప్రసంగమువచ్చిన నూరకుండు నే ।
మో వరటాలలామ యిఁక మద్దియసన్నిధి నేమి సేయుదున్ ॥ ౧౨ ॥

ఉ॥ పోవునొకో సరోజముఖిపొంతకు నింకొకమాటు హంసి దా ।
నావలనం దదిష్టవచనం బొకటేన్ గొనిపోవఁ గానమిన్ ।
బోవుట నిష్ఫలంబనుచుఁ బోకయెమానునొ కాకపోవునో ।
దైవతకార్యభాగమును దద్వశమైనది కొంతగల్గినన్ ॥ ౧౩ ॥

క॥ తరుణి కడకంచయేగతి । నరిగిననాస గలదది మహోమతి నాయం ।
తరగతిఁ గనదేవినదే । ధర నప్రతిషిద్ధ మనుమతంభవతి యనన్ ॥ ౧౪ ॥

క॥ ఏపనియు లేకయుండిన । నాపదఁతుకఁ జూడఁజనక హంసినిలువనె ।
ట్లోపెడునుదానిఁజూచిన । జూపఱకును వశమె తిరుగఁజూడక యుండన్ ॥ ౧౫ ॥

[సశేషము.] పింగళి-సూరన్న.

ఆంధ్రకవులచరిత్రము, మధ్యకవులు. (౧౨౪-పుట శేషము.)

వీరుగాక తక్కినకవులు కృష్ణదేవరాయల యాస్థానమునందుఁగాని యాతని కాలమునందుఁగాని యున్నట్లు తోఁచదు. రామరాజభూషణాదులు కృష్ణరాయల యాస్థానమునం దున్నట్లనేకకథలు వానఁబడుచున్నవికాని యితర నిదర్శనములు లేక యవి విశ్వసింపఁదగినవికావు. ఆయాకవుల కాలమునుగూర్చియు వారివారి విషయమయి చెప్పఁబడు కథలనుగూర్చియు నాయాకవుల చరిత్రములయందు వ్రాయఁబడును. ఆముక్తమాల్యదయందును మనుచరిత్రమునందును గల యేకరీతిపద్యములను గూర్చి సహితమిచ్చట విస్తరించి వ్రాయుట యనావశ్యకము. అయినను దృష్టాంతము చూపుటకయి యొక్క పద్యమునుమాత్ర మిందుదాహరించుచున్నాను —

సీ॥ నీలమేఘముడాలు డీలుసేయఁగఁజాలు మెఱుఁగుఁజామనచాయ మేనితోడ।
నరవిందములకచ్చు లడఁగించుజిగిహెచ్చు నాయతంబగు కన్నుదోయితోడఁ।
బులుఁగురాయనిచట్టుపల వన్నెనారవట్టు హొంబట్టు జిలుఁగుఁ కెంజెంబుతోడ।
నుదయార్కబింబంబు నొఱపువిడంబంబు దొరలంగ నాడు కౌస్తుభముతోడ।
జయజయధ్వనిమౌళి నంజలులు చేర్చు। శర్వశతధృతి శతమన్యు శమనశరధి।
పాలకైలబిలాది దేవాళితోడ। నెదుటఁ బ్రత్యక్షమయ్యె లక్ష్మీశ్వరుండు॥—మను
చరిత్ర. ఆ. ౬.

మనుచరిత్రముయొక్క యాఱవయాశ్వాసమునందు స్వారోచిషమనువు విష్ణుని గూర్చి తపస్సు చేయఁగా నతఁడు ప్రత్యక్షమయినట్లు చెప్పఁబడిన పయిపద్యమునే దీర్ఘపాదముల నేమియుమార్పక యెత్తుగీతమును మాత్ర మీక్రిందిరీతిగా మార్చి యాముక్తమాల్యద ప్రథమాశ్వాసమునందుఁ గృష్ణదేవరాయఁడు తనకు శ్రీకాకుళాంధ్రదేవుఁడు ప్రత్యక్షమయినట్లు చెప్పినఘట్టమునందు వేసికొనియున్నాఁడు—

సీ॥ నీలమేఘముడాలు............. ....కౌస్తుభముతోడఁ।

గీ॥ దమ్మికేలుండఁ జెఱకేలదండయిచ్చు।
లేము లుడిపెడు లేఁజూపు లేమతోడఁ।
దోల్కదయఁదెల్పు చిఱునవ్వుతోడఁ గలఁడ।
దంధ్రి జలజాక్షుఁ డిట్లని యానతిచ్చె॥—ఆముక్తమాల్యద ఆ. ౧.

కృష్ణరాయలనుగూర్చి బహుకవులు చాటుపద్యము లనేకములు కూర్చియున్నారు గాని గ్రంథవిస్తారభీతిచేత వానినన్నిటి నిందువ్రాయక రెండుమూడు పద్యములను మాత్రము చూపుచున్నాను—

౧ శా॥ శ్రీలీలాత్మజ కృష్ణరాయ సమరోర్వి న్నీదు వైరిక్షమా।
పాలు ర్వేఁగి హయాధిరూఢులగుచుం బాఱన్ వనీశాఖి శా।

ఖాలగ్నాయత కేశపాశులయి తూగన్ గేకిసల్గొట్టి యు।
య్యాలలో జొంపములంచుఁ బాడుదురు భిల్లాంభోజ పత్రేక్షణల్॥

౨.—చ॥ ఘనమిటిచేయు పుణ్యజనపీడనవృత్తియుఁ దంత్రిభంగముఁ।
దనయు ననంగభావమును దన్మనికార్శ్యముఁ జూచి రోసి స।
జ్జనపరిరక్షు శౌర్యనిధిఁ జారుశరీరుఁ గళాప్రపూర్ణు న।
వ్వనధికన్యచేరె జితవైరినికాయుని గృష్ణరాయనిన్॥

౩.—చ॥ కాయమువంగి తాముదిసెఁ గచ్చులునుం బొరగప్పెఁ గాలు పే।
దాయెనటంచు రోసి నరసాధిపనందన కృష్ణరాయ యీ।
భూయువతీలలామ నినుఁబొందిన నాదిభుజంగభర్తకున్।
బాయనిచింతచేతఁ దలప్రాణము తోఁకకు రాకయుండునే?॥

ఈ కడపటి పద్యముయొక్క కర్తృత్వమును తెనాలి రామకృష్ణున కారోపింతురు. రాజుమాత్రమే కాక కృష్ణరాయని కొమార్తెలును సంగీతసాహిత్యములయందు నిపుణురాండ్రనియు, రామరాజు భార్యయైన మోహనాంగి యనునామె "మారీచిపరిణయ" మను నైదాశ్వాసముల శృంగారప్రబంధము రచియించెననియు, ఒకరు వ్రాసియున్నారుగాని మాకాగ్రంథము లభింపకపోవుటచేత నిదియిట్లని నిశ్చయింపఁజాలకున్నాము. కృష్ణరాయని యల్లుఁడయిన రామరాజు భార్యపేరు మోహనాంగి యైనట్లును గానఁబడదు. అయినను మోహనాంగియను పేరు తిరుమలాంబకు నామాంతరమయి యుండవచ్చును.

మంత్రియైన తిమ్మరుసుయొక్క బుద్ధిబలముచేతను మంత్రశక్తిచేతను కృష్ణదేవరాయని కధికవిఖ్యాతి కలిగెనని చెప్పుదురు. ఈ మంత్రిశిఖామణి క్షత్రియుఁడయినట్లును, ఇంటిపేరు సాళువవా రయినట్లును, అనేక శిలాతామ్ర శాసనములవలనను కృష్ణరాజ విజయమువలనను తెలియవచ్చుచున్నది. అయినను కృష్ణామండలములోని కొండకావూరి దేవాలయములోని యొక శిలాదానశాసనములో మాత్ర మాతని పేరు సాళువ తిమ్మరుసయ్యంగారని వ్రాయఁబడి యున్నది. అయ్యంగారని యుండుటనుబట్టి కొందఱాతఁడు బ్రాహ్మణుఁడని భ్రమపడినను, "సాళువ" యనెడియింటిపేరును బట్టియు నితర నిదర్శనములనుబట్టియు నతఁడు బ్రాహ్మణుఁడు కాఁడనియు "అయ్యంగా"రని గౌరవార్థముగా నుపయోగింపఁబడె ననియు నిశ్చయింపవలసి యున్నది. ఈసాళువ తిమ్మరాజు కృష్ణరాయనితండ్రియైన నృసింహరాజుతమ్ముఁడని కొందఱు చెప్పుదురు. ఈసంగతి యథార్థమయినను కాకపోయినను, అతఁడు నృసింహరాయనియొద్ద మంత్రిగానుండెను. ఈర్ష్యచేత నృసింహరాయని పట్టమహిషి

సవతికొడుకైన కృష్ణదేవరాయని జంపింప యత్నించినప్పు డాతనిని దనయొద్ద నుంచుకొని కాపాడిన దీసాళువ తిమ్మరుసే. ఈహేతువును బట్టియే కృష్ణదేవరాయలు తిమ్మరుసు నప్పాజియని పిలుచుచుండుటయు, అప్పాజీయనెడుపేరే పుస్తకముల యందు సహితము వాడఁబడుచుండుటయు సుప్రసిద్ధము. ఈమంత్రిశిరోమణి ౧౫౧౫వ సంవత్సరమునందు రాజు కొండవీటిమీఁదికి దండెత్తినప్పుడు తాను సేనాధిపతిగా నుండి సేనలనునడిపి కొండవీటిదుర్గమును జయించెను. ఈతఁడు కృష్ణదేవరాయల కంటె మూడుసంవత్సరములు ముందుగా ననఁగా హూణశకము ౧౫౨౭వ సంవత్సరమునందు మృతినొందెను. తిమ్మరుసు బ్రాహ్మణుఁడనియు చిన్నతనములో మిక్కిలి బీదవాఁడయి విద్యలేక తిరుగుచుండెననియు చెప్పెడు కథయొకటి కొంతకాలము నుండి పరంపరగా వచ్చుచున్నది. ఆకథయొక్క సత్యమెట్టిదయినను వినువారికి వినోదకరముగా నుండుననియెంచి యిందు సంగ్రహముగా వ్రాయుచున్నాను.—

“తిమ్మరుసు నియోగిబ్రాహ్మణుఁడు. ఈతఁడు బాల్యమునందే తల్లిదండ్రులను బోఁగొట్టుకొని నిరాధారుఁడై చదువును సంధ్యయు లేక తిరుపతిసమీపమున పసులఁగాచి బ్రతుకుచు, పిమ్మట గుత్తికిఁబోయి యచ్చటఁ బుల్లెలుకుట్టి కొంతకాలము జీవించి, తరువాత చంద్రగిరిలోఁ గొంతకాలము మాధుకరవృత్తిచే దినములుపుచ్చి, అనంతరము పెనుగొండలో సత్రములో నుద్యోగము సంపాదించి తద్దుర్గాధీశ్వరుని తాంబూలపుతిత్తులు మోచి తదనుగ్రహమువలనఁ గ్రమక్రమముగా వృద్ధినొంది గొప్పయుద్యోగములు సంపాదించి, కడపట తనబుద్ధిబలమువలన మంత్రిపదమును బొందెను. ఇతఁడు చిన్నతనములో తిరుపతి సమీపమునఁ బసులనుగాచుచు బడలి యొకనాటిమధ్యాహ్నసమయమున నొకచెట్టునీడను విశ్రమించెను. అంతటసూర్యుఁడు పశ్చిమమున వ్రాలుటచే సూర్యకిరణము లాతనిమీఁదఁ బడినను మెలఁకువరాక యతఁడు మైమఱచి గాఢనిద్రను బొందుచుండుట చూచి యొక కృష్ణసర్పము చేరవచ్చి తన ఫణము విచ్చి యాచిన్నవాని ముఖమున కెండసోఁకకుండ గొడుగువలె నడ్డము పెట్టెను. ఈయద్భుతచర్య నప్పుడు దారిపట్టి పోవుచున్న భట్టుమూర్తియను భట్రాజు చూచి యీతఁడు శీఘ్రకాలములోనే మహైశ్వర్యవంతుఁడు కాఁగలఁడని తెలిసికొని, సమీపమునకుఁబోఁగా సర్ప మాతనినివిడిచి పాఱిపోయెను. ఆభట్రాజు తరువాత నాచిన్నవాఁడు మేల్కొనువఱకును వేచియుండి లేచినతరువాత ‘అయ్యా! నీకచిర కాలములోనే గొప్పయైశ్వర్యము పట్టును. అప్పుడు నన్ను మఱచిపోకుము’ అని చెప్పి సెలవు గైకొని స్వగ్రామమునకుఁ బోయెను. అటుపిమ్మట తిమ్మరుసు పయిని జెప్పినరీతిని క్రమక్రమముగా వృద్ధినొంది విద్యాబుద్ధులు సంపాదించి కొంతకాలము

వకు మంత్రిపదము నొందెను. అప్పుడు భట్టుమూర్తి తిమ్మరుసు దర్శనార్థముపోయి యతఁడు తగినంత యాదరముచూపి గౌరవింపక యుపేక్షించుట చూచి,

శా॥ గుత్తిం బుల్లెలుకుట్టి, చంద్రగిరిలోఁ గూడెత్తి, కొన్దొండలో।
హత్తిన్సత్రమునందు వేఁడి బలుసుర్గాధీశు తాంబూలపుం।
బిత్తుల్మోసి పదస్థులై ఘనులకా దీవించ.........

అనువఱకుఁ బద్యముచెప్పువఱకు భయపడి తిమ్మరుసు తనకుఁ గృష్ణదేవరాయలు పట్టాభిషేక మహోత్సవ సమయమునం దిచ్చిన పచ్చల పతకమును భట్టుమూర్తి మెడనువేసెను. అదియందుకొని యాభట్టు తక్కినపద్యభాగము నీరీతిని బూరించెను—

..... దీవించెదన్।
మత్తారాతి యయాతినాగమసుతు న్మంత్రీశ్వరుం దిమ్మనన్॥

అని చదివి యప్పుడే యీక్రిందిపద్యమును గూడఁ జెప్పెను—

క॥ అయ్యా వనిపించుకొంటివి। నెయ్యంబునఁ గృష్ణరాయ నృపపుంగవుచే।
న య్యా నీసరియేరీ। తియ్యని విలుకాఁడవయ్య తిమ్మరుసయ్యా॥

ఇట్లు గారుత్మతహారమును భట్టున కిచ్చుటచే నాప్రధానచంద్రుఁడు "బట్టుమూర్తికిఁ జిక్కరెట్టింపఁ బచ్చలహార మర్పించెఁ దిమ్మరుసుమాళి"యని ప్రసిద్ధిఁగాంచెను."

ఈతనికి బట్టుమూర్తికినిగల కాలవ్యత్యాసమును బట్టికూడఁ బయికథ విశ్వాసార్హమయినది కాదు. కృష్ణదేవరాయనికిఁ బుత్రసంతానము లేనట్టే యనేకస్థలములయందుఁ జెప్పఁబడియున్నది. అచ్యుతదేవరాయలే కృష్ణదేవరాయని పుత్రుఁడని యొకచోటను, సదాశివదేవరాయలు కృష్ణదేవరాయని పుత్రుఁడని యొకచోటను, చెప్పఁబడెనుగాని వానిసత్యమును గూర్చి యింకను విచారింపవలసియున్నది. కృష్ణదేవరాయని మరణకాలమునం దాతని కిద్దఱు కొమార్తలుండిరి. వారికప్పటికి వివాహము కాలేదు. తరువాత తిరుమలదేవి కొమార్తను రామరాజును, చిన్నాదేవికొమార్తను దదనుజుఁడైన తిరుమలదేవరాయఁడును పరిణయమైరి. ఇట్లు కర్ణాటరాజ్యమును మహోచ్చదశయందుంచి కృష్ణదేవరాయలు శుక్లసంవత్సర వైశాఖమాసము మొదలుకొని వికృతిసంవత్సరమువఱకును ఇరువదియొక్క సంవత్సరములు రాజ్యము చేసి శాలివాహనశకము ౧౫౩ంవ సంవత్సరమునందుఁ గీర్తిశేషుఁడయ్యెను. అచ్యుతదేవరాయలాసంవత్సరమున రాజ్యమునకువచ్చి, పండ్రెండు సంవత్సరములు పరిపాలనము చేసి, తిరుణవల్లి మొదలయిన దేశములను జయించి పరలోకగతుఁడయ్యెను.

అల్లసాని పెద్దన్న.

అల్లసాని పెద్దనార్యుఁడు నందవరీక నియోగి బ్రాహ్మణుఁడు; చొక్కనామాత్యుని పుత్రుఁడు, బళ్లారి ప్రాంతములయందున్న దూపాడు పరగణాలోని దోరా గ్రామ మీతని జన్మస్థలము; కృష్ణదేవరాయల యాస్థానకవీశ్వరులలో నెల్ల ముఖ్యుఁడు. ఈతఁడు కృష్ణదేవరాయల యనంతరముఁ గూడ కొంతకాలము జీవించియుండుట చేత, ఇంచుమించుగా ౧౫౩౫వ సంవత్సరము వఱకును బ్రతికియుండెనని చెప్ప వచ్చును. కృష్ణరాయలు మృతినొందిన తరువాత నీతఁడుచెప్పిన జాలిని పుట్టించె డి యీ క్రిందిపద్య మీతఁడు రాయలయనంతరమున జీవించియున్నట్టు తెలుపుచున్నది

సీ॥ ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేగఁ బల్లకి తన కేలఁ బట్టి యెత్తె।
బిరుదైన కవిగండపెండేరమున కీవె తగుదని తానె పాదమునఁ దొడిగెఁ।
గోకటగ్రామా ద్యనేకాగ్రహారము లడిగిన సీమలయందు నిచ్చె।
నాంధ్రకవితాపితామహ యల్లసాని। పెద్దనకవీంద్ర యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేగలేక। బ్రతికియుంటి జీవచ్ఛవంబ నగుచు॥

అంతేకాక కృష్ణదేవరాయలు లోకాంతరగతుఁడు కాఁగానే కటకమునుండి గజపతి దండెత్తివచ్చినట్టును, అల్లసాని పెద్దన యీ క్రిందిపద్యమును వ్రాసి పంపఁగా నతఁడు సిగ్గుపడి మరలిపోయినట్టును జెప్పుచున్నారు.—

సీ॥ రాయరాహుత్తగండ రాచయేనుఁగువచ్చి యారట్లకోటఁ గోరాడునాఁడు
సంపెటనరపాల సార్వభౌముఁడువచ్చి సింహాద్రిజయశిలఁ జేర్చునాఁడు।
సెలగోలుసింహంబు చేరి ధిక్కృతిఁ గంచు తల్పులఁ గరుల ఢీకొల్పునాఁడు।
ఘనతరనిర్భరగండపెండేరమిచ్చి కూఁతు రాయలకును గూర్చునాఁడు।
నోడ తెలుంగవో చచ్చితో యుర్వి లేవొ। చేరఁజాలక తలచెడి జీర్ణమైతొ।
కన్నడంబెట్లు చొచ్చెదు గజపతీంద్ర। తెఱచినిలుకుక్క చొచ్చిన తెఱఁగుతోఁ

ఈకవి రాజునొద్ద మిక్కిలి గౌరవము పొందినవాఁడయి, రాజు చెప్పుమన్నప్పుడుగాక తనయిష్టమువచ్చినప్పుడు మాత్రమె కవిత్వముచెప్ప స్వాతంత్ర్యము గలవాఁడనియు, రాజొకనాఁడు కృతిచెప్పుమని వేఁడఁగా నతఁడుచెప్పక యీ క్రింది పద్యమును జెప్పెననియు వాడుకగలదు—

చ॥ నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క।
ప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యెలమంచ మొప్పు త।

ప్పరయు రసజ్ఞులూహఁ దెలియంగల లేఖక పాఠకోత్తముల్।
దొరకినఁగాక యూరక కృతుల్రచియింపుచు టన్న శక్యమే?॥

కవియే కవిత్వ ముండవలసిన రీతిఁ గూర్చి యీ క్రింది పద్యమును గూర్చెనని చెప్పుదు—

చ॥ ఘనతర ఘూర్జరీ కుచయుగక్రియ గూఢము గాక ద్రావిడీ।
స్తనగతిఁ దేటగాక యరచాటగు నాంధ్రవధూటి చొక్కపుం।
జనుఁగవలీల గూఢతయుఁ జాటుతనంబును లేకయుండఁ జె।
ప్పినయదె పో కవిత్వ మనిపించు నగించటుగాక యుండినన్॥

...స నార్యుఁడు సంస్కృతాంధ్రములయం దసమాన సాహిత్యముగలవాఁడు. ఇతఁ...క నాఁడు కృష్ణదేవరాయల యాస్థానములో సకలకవీశ్వరులు నుండఁగా రాజు...రికమీఁద నుభయభాషా పాండిత్యము వెల్లడియగునట్లుగా నొక యుత్పలమాలిక...శుకవిత్వముగాఁ జెప్పి సభవారినందఱిని మెప్పించి కాలికి బిరుదందె వేసికొన్న...ఁడు. రాజు కవిగండపెండేరమును బసిఁడిపళ్ళెరమున నునిచి, సంస్కృతాంధ్ర...లందు సమానముగా కవిత్వము చెప్పఁగలవారు దీనిని ధరింపనర్హులని పలికినప్పుడు ...ద్ద నార్యుఁడు లేచి యీ క్రింది యుత్పలమాలికను జదువఁగా రాజు మెచ్చి తానే ...మా కవిగండపెండేరమును కవి పాదమునఁ దొడిగెనఁట—

ఉ॥ పూఁత మెఱుంగులున్ బసరుపూపబెడంగులుఁ జూపునట్టి వా।
కైతలు జగ్గునిగ్గు నెనగావలెఁ గమ్మనఁ గమ్మనన్వలెన్।
రాతిరియున్ బవల్ మఱపురాని హొయల్ చెలియారజంపు ని।
ద్దాతరి తీపులంబలెను దారసిలన్వలె లోఁదలంచినన్।
బాతిగఁ బైకొనన్వలెను బైదలి కుత్తుకలోని పల్లటీ।
కూతలనన్వలెన్ సొగసుకోర్కు రావలె నాలకించినన్।
చేతికొలందిఁ గౌఁగిటను జేర్చినఁగన్నియ చిన్నిపొన్ని మే।
ల్మూతల చన్నుదోయివలె ముచ్చటగావలెఁ బట్టిచూచినన్।
డాతొడనున్న మిన్నులమిటారపు ముద్దులగుమ్మ కమ్మనా।
వాతెఱ దొండపండువలె వాచవిగావలెఁ బంటనూఁదినన్।
గాతలఁ దమ్మిచూలిదొరకైవసపుంజవరాలి సిబ్బెపు।
న్మేతెలియబ్బురంపు జిగినిబ్బరపుబ్బగు గబ్బిగుబ్బ పొం।
బూతలనున్న కాయసరిపోడిమి కిన్నెరమెట్లబంతి సం।
గాతపు సన్నబంతి బయకారపుఁ గన్నడగౌళపంతు కా।

సాంతత తానతానల పసం దివుటాడెడు గోటమీటు జల్।
స్రోతలునుం బలెన్ హరువు మెల్లముగావలె నచ్చతెన్గు లీ।
రీతిగ సంస్కృతంబు పచరించిన పట్టున భారతీవధూ।
టీ తపనీయ గర్భనికటీ భవదానన సర్వసాహితీ।
భౌతిక నాటకప్రకర భారతభారత సమ్మతప్రభా।
శీత నగాత్మజా గిరిశశేఖర శీతమయూఖరేఖికా।
పాతసుధాప్రపూర బహుభంగ ఘుమంఘుమ ఘుంఘుమార్భటీ।
జాతకతాళయుగ్మ లయసంగతి చుంచువిపంచికామృదం।
గాతత తేహింత త్తహింత హోధిత దంధణు ధాణువింధిమి।
వ్రాత నయానుపద వారికహూద్వహ హారికింకిణీ।
నూతన ఘల్ఘులాచరణ నూపురఝూళ ఝుళీమరంద సం।
ఘాతవియద్ధునీచక చకద్వికచోత్పల సారసంగ్రహా।
యాతకుమారగంధవహ హారిసుగంధ విలాసయుక్తమై।
చేతము చల్లఁజేయవలె జల్లునఁ జల్లవలెన్ మనోహర।
ద్యోతక గోస్తనీఫల మధుద్రవ గోఘృత పాయసప్రసా।
రాతి రసప్రసార రుచిరప్రతిమంబుగ సారెసారెకున్॥

పెద్దనార్యుఁడు హరికథాసారము, స్వారోచిషమనుచరిత్రము మొదలయిన పెక్కుగ్రంథములను రచియించెను. వానిలోనెల్ల మనుచరిత్రము మిక్కిలి ప్రసిద్ధమయి యెల్లయెడల వ్యాపించియున్నది. ఈయనకుఁ బూర్వమునందున్న కవు లెవ్వరును స్వకల్పనమును విశేషముగాఁ జేర్చి ప్రబంధములను రచియించి యుండలేదు; వారు పురాణేతిహాసాదులను మాత్రము తెనిఁగించిరి. ఈతఁడే మార్కండేయపురాణమునుండి స్వారోచిష మనుసంభవకథను గైకొని పెంచి స్వకపోలకల్పనలతో మొట్టమొదట మనుచరిత్రమును ప్రబంధరూపమున రచియించిన కవియగుటచేత నీతని కాంధ్రకవితా పితామహుఁడన్న బిరుదనామము కలిగినది. ఈతనికాలము మొదలుకొని రామరాజభూషణుఁడు వసుచరిత్రము చేయువఱకునుగల కవులందఱును జాలవఱకుఁ దమప్రబంధములను మనుచరిత్రరీతినే చేసిరి. ఈకవి జన్మముచేత స్మార్తుఁడే యయినను, నడుమ వైష్ణవము పుచ్చుకొని వైష్ణవాగ్రేసరుఁడయి విష్ణ్వాలయములకు భూదానాదులను జేసెను. ఈవిషయమే మెకంజీ దొరవారు సంపాదించి యుంచిన రాజకీయ ప్రాగ్దేశ పుస్తక భాండాగారమునందలి వ్రాతపుస్తకముల యందుఁ దెలుపఁబడి యున్నది. అందున్న కోకటాగ్రహారమును గూర్చిన యంశము నిందు క్రింద వ్రాయుచున్నాను—

"అల్లసాని పెద్దయ్యంగారు బ్రాహ్మణుఁడు; నందవరీకుఁడు; చొక్కరాజుగారి కొమారుఁడు. కోటక గ్రామమును శ్రీ కృష్ణదేవరాయలవారు కవీశ్వరుని కియ్యఁగా, అతఁడు వైష్ణవముపుచ్చుకొని యీగ్రామము శ్రీవైష్ణవుల కగ్రహారముచేసి యిచ్చెను. అప్పుడు దానికి పెట్టిన క్రొత్తపేరు శఠగోపపురము. ఈకవి శాలివాహనశకవర్షములు ౧౪౪౦ బహుధాన్యసంవత్సర వైశాఖ శుద్ధ ౧౫లు నాఁడు ఈ గ్రామమునందుండు సకలేశ్వరస్వామికి నైవేద్య దీపారాధనలకై రెండుపుట్లచేను ధారపోసియిచ్చి సదరుదేవాలయములో శిలాశాసనము వేయించినాఁడు. పయిసంవత్సరము కార్తికశుద్ధ ౧౨ నాఁడు చన్నకేశవస్వామికి నాలుగున్నరపుట్లభూమి ధారపోసి శాసనము వేయించినాఁడు.......కృష్ణదేవరాయల తర్వాత సదాశివదేవరాయల కాలములోను, రామరాయల కాలములోను, నంద్యాలరాజయిన మల్లు అనంతరాజు కాలములోను కోటకాగ్రహారము బ్రాహ్మణులకుఁ జెల్లెను."

ఈకవి కోకటాగ్రహారమునకు శఠగోపపురమని పేరుపెట్టుటయేకాక తన మనుచరిత్రములోను హరికథాసారములోనుగూడ శఠగోపయతిని దనగురువునుగా స్తుతించియున్నాఁడు—

క॥ కొలుతు న్మద్గురువిద్యా। నిలయుం గరుణాకటాక్షు నిబిడజ్యోత్స్నా।
దళితాశ్రితజనదురిత। చ్ఛలగాఢధ్వాంతసమితిశఠగోపయతిన్॥—మనుచరిత్ర.

క॥ శఠగోపయతికి ఫలతరు। కుఠారకోపమతికి శఠగురు మతహృత్క।
ర్మఠ నిరతికిఁ జతురాగమ। పరనాయత నియతికి నజపా సంభృతికిన్॥—హరి
కథాసారము.

లక్షణగ్రంథములయం దక్కడక్కడ నుదాహరింపఁబడిన పద్యములు లభించుటయే కాని హరికథాసారము పూర్ణముగా దొరకినదికాదు. హరికథాసారములోని యీ రెండుపద్యములును రంగరాట్ఛందస్సునం దుదాహరింపఁబడియున్నవి—

క॥ అంబరముపగుల నార్చి ప్ర।లంబాసురుఁ డాగ్రహము పెలయఁ గదిసిన వే।
ళం బలరాముఁడు చేముస।లంబున వానిశిలఁ ద్రుంచె లావుమెఱయఁగన్॥—
హరికథాసారము. ఆ. ౪.

క॥ తెంపరియై మదియింత చ।లింపక యనిలోనఁ దెగియె నెవ్వఁడతఁడునై।
లింపసభనుండు ననుఁడుఁ బ్ర।దంపడి యాచార్యతోడఁ దానిట్లనియెన్—
హరికథాసారము.

[సశేషము] కం. వీరేశలింగము.

జంతుస్వభావచరిత్రము. (౧౩౨-పుట శేషము.)

సింహ మతిధైర్యమును దయాగుణమును గలదని కొందఱును, పిఱికితనమును క్రూరత్వమును గలదని కొందఱును, పరస్పరవిరుద్ధముగా వ్రాసియున్నారు. ఇం దెవ్వరు చెప్పినదియు పూర్ణముగా సత్యముకాకపోయినను గొంతవఱ కిరుతెఱం గులవారి వాక్యములయందును సత్యము గలదు. మిక్కిలి యాఁకలిగొన్నప్పుడు సింహ మనివార్య ధైర్యసాహసములు కలదయి నూఱుమంది యాయుధపాణులయి నిలిచి యున్నను వెనుకతీయక మీఁదఁబడి యందెవ్వనినైనను గొనిపోవును, కడుపు నిండి యున్నప్పుడు నలుగురు నిరాయుధులు చేరి యఱచినను వారిమీఁదఁ బడుటకు చొరవ చేయక పాఱిపోవును. క్షుత్పీడితము యుండినప్పుడు లేళ్ళమందలమీఁదఁ బడి తఱిమి పెక్కుజంతువులను హింసించి క్రౌర్యముచూపునది జఠరాగ్ని శాంతిపొంది యున్నప్పుడు చేరువనుండి లేడిపిల్లఁ బోవుచున్నను దానిజోలికిపోక దయచూపును. పిల్లి జాతిలోఁజేరిన సింహము మొదలయిన సమస్తజంతువులును పొట్టయేడిపించినప్పు డధికముగా ధైర్యసాహసములను చుఱుకుఁదనమును గనఁబఱచుచు, ఆ కడుపుని చ్చాఱినతరువాత సాధారణముగా మాంద్యము గలవయి యొకచోట నడఁగి పడి యుండును. క్షుద్బాధ విస్తారముగా నున్నప్పుడు సహితము సింహము కావలసిన దానికంటె నెక్కువశ్రమపడుట కిష్టములేనిదయి, సులభముగా నొక్క చేతిదెబ్బ తోఁ గూలెడు దుర్బలమయిన లేడి దొరకినపక్షమున దానినివిడిచి కష్టసాధ్యమైన బలవంతమయిన మహిషమును బట్టుకొనుట కెప్పుడును బ్రయాసపడదు. ఈ హే తువుచేతనే యొక్కసారి మనుష్యుని బట్టుకొని రుచిమరగిన సింహము పిక్కబలము గలిగి యందక పరుగెత్తెడి లేళ్ళకొఱకుఁగాని యెదిరించి పోరాడెడు బలముగల దున్నపోతులకొఱకుఁగాని ప్రయత్నము చేయక స్వభావముచేత నంతవేగమును బల ములేని సుఖసాధ్యుఁడయిన మనుష్యునికొఱకే వేచియుండి, గ్రామముల సమీప మునఁ బొంచియుండి యొంటిగాఁ దిరుగఁ దటస్థించిన యొక్క పురుషునో స్త్రీనో శిశువునో నోరఁ వేసికొనిపోవుచుండును. మనవారు పురాణములయందు సింహ మేనుఁగులయొక్క కుంభస్థలములయందలి మెదడునేకాని మఱిదేనిని తినదని యెంతవర్ణించినను, అది కుంజరమువంటి మహాజంతువుల జోలికి పోక సులభ్యములైన క్షుద్రజంతువులతోనే తృప్తినొందుచుండును. అంతేకాక యది వీరపురుషునివలె నెదుటఁబడి పోరాడక, తాను కన్నువేసిన జంతువును దొంగవలెఁ బొంచుండిగాని పట్టుకొనఁ జూచును. సింహగర్జన మురుమువలె గంభీరమయి భయంకరమైనదిగా నుండును. అది యెరకొఱకు అఱచుచు తిరుగుచు, జంతువేదియు దొరకకపోయిన పక్షమున, సాయంసమయమున ముట్టె భూమిమీఁద కొట్టి పర్వతగుహాలు మాఱు

మ్రోయునట్లుగా గర్జిల్లును. భయంకరమయిన పిడుగువంటి యాచప్పుడు చెవులఁబడినతోడనే గుండెలవియ తత్తరపడి యాచప్పు డేకడనుండి వచ్చెనో తెలిసికోలేక యడవినిగల జంతువులు నానాముఖముల పరుగెత్తును. ఆ భయభ్రాంతిలోఁ గొన్నిజంతువులం మృత్యుముఖమును జొచ్చినట్లు సింహాము సమీపమునకే పరుగెత్తఁగా, గారెలు విడువ నాతురపడుచున్న శ్రాద్ధభోక్తవలె నోరూర వేచియున్న యా సింహాము వానిలో నొకటిరెంటిని నోరవేసికొనును.

సింహాముకద్ద నేర్పును మాయలునుకూడఁ గలవు. అది తన శత్రువు సమీపించుచున్నట్లు వాసనపట్టి నిమిషములో పసిపట్టి గ్రహించును; తన శరీరగంధమువలన జంతువులు తనరాకను కనిపెట్టి పాఱిపోవునని తెలిసికొని తనమీఁదిగాలి జంతువుల ముక్కునకు సోఁకకుండునట్లుగా గాలికెదురువైపు నడిచి చెట్లు డొంకలు మొదలయినవాని మఱుఁగుననుండి కంటికిఁ గానఁబడకుండఁబోయి రేమఱుపాటున వానిమీఁదఁబడును. సింహాముయొక్క కోఱలలో విషమున్నదని యూహింపఁబడుచున్నది. పూర్వ మొకమనుష్యుఁడు సింహాముచే కఱవఁబడియు తప్పించుకొని బ్రదుకుట తటస్థించెను. పయి కాతనిగాయము పూర్ణముగా మానిపోయినను, సంవత్సరమయినతరువాత కఱచినదినముననే మరల గాయము బద్దలయి చీముకార నారంభించెను. ఆప్రకారముగానే సింహాము కఱచిన మఱియొకనికి కఱచినచోట నేటేట క్రొత్తగా పుండుపడుచు ఆఱుసంవత్సరములు బాధపెట్టెను.

జనులు సాధారణముగా ననుకొనునట్లు సింహ మెల్లప్పుడును బ్రతికియున్న జంతువులను వేటాడిమాత్రమే జీవనము చేయును. ఒకానొకప్పుడు దొరకినపశువును, చచ్చినజంతువునుసహితము సంకోచములేక భక్షించును. కాఁబట్టి వేటగాండ్రు లేడి మొదలయిన జంతువు నొకదానిని చంపి యనుకూలమయినచోట నీటిపట్టునకు సమీపమునవైచి దప్పి తీర్చుకొనుటకై వచ్చిన సింహాము దానిని చూచి తినుచుండఁగా, చెట్లుమొదలయిన యున్నతస్థలముల మాటొగ్గియుండి దానిని గుఱిపెట్టి కాల్చి చంపుదురు. సింహాము పులిమొదలయిన యితర ఘాతుకమృగములవలె మృగముల మెడపట్టుకొనక సాధారణముగా భుజములమీఁద పట్టుకొని చంపును. సింహాము మిక్కిలి బలిష్ఠమయిన జంతువుగనుక, ఆఁబోతువంటి గొప్పజంతువును సహితము నోటఁ గఱచుకొని పొదలు గోతులు మొదలైనవి దాటి యీడ్చుకొని పోఁగలదు. సింహ మొక్కొకసారికి మూఁడునాలుగేసి పిల్లలనుపెట్టును. అవి మిక్కిలి బరువుగానుండి యీయీడును పరిమాణమునుగల రే యితరజంతువుకంటెను అధికభారము కలవిగా నుండును. అవి మూఁడు నాలుగు సంవత్సరములకుఁగాని పూర్ణముగా నెదు

గవు. ఆఫ్రికా ఖండమునందు సింహములు విస్తారముగా నున్నవి. ఆదేశములో నరణ్యమార్గముచేఁ బోవు బాటసారులు ప్రతిదినము చీఁకటిపడినతరువాత సింహగర్జనములను విందురు. హిందూదేశమునందుఁగల సింహములకును వీనికిని రూపగుణాదులయందు విస్తారభేదమేమియు లేదు. కొంతకాలముక్రిందట ఘూర్జరదేశము నుండి యింగ్లాండునకుఁ గొనిపోఁబడిన సింహమునకు జూలు పొట్టిగా నుండుట చూచి యది వేఱుజాతియని జంతుశాస్త్రజ్ఞులు కొందఱు భ్రమపడిరిగాని వారి యూహ సరియైనదికాదు. ఇప్పుడు హిందూదేశమునందు సింహములించుమించుగా నశించిపోయినవి. ఇప్పుడు ఘూర్జరమునందును రాజపుత్రస్థానమునందును మాత్ర మరణ్యములలోఁ గొన్నిసింహము లుండియుండవచ్చును. ౧౮౬౮వ సంవత్సరమునందు ప్రయాగకు పడమటను మూడామడ దూరములోనున్న శివరాజపుర సమీపమున నొకసింహము చంపఁబడెను; మఱియొకటి ౧౮౬౬వ సంవత్సరమునందు ప్రయాగనుండి జబ్బలపురమునకు రహదారి వేయుచున్నప్పుడు ప్రయాగనుండి యెనుబదవ మయిలురాయి సమీపమునఁ జంపఁబడెను. ౧౮౭౩వ సంవత్సరమునందు ఘూర్జరదేశములోని గుణపుర సమీపమునం దొకసింహము చంపఁబడెను. ౧౮౩౦వ సంవత్సర ప్రాంతములయం దహమదాబాదు పురసమీపమున సింహములు సాధారణముగాఁ గానఁబడుచుండెను.


సింహములు పగలంతయు నిద్రపోవుచుండి రాత్రులుబయలుదేరి యెరనిమిత్తము సంచారము చేయుచుండును. పులులకంటె సింహము లధికధైర్యము కలవని చెప్పుదురు; అవి యరణ్యములును కొండగుహలును ప్రతిధ్వని యిచ్చునట్లుగా వ్యాఘ్రములకంటె నధికముగా ధ్వనిచేయును. హిందూదేశమునందున్న సింహములు సాధారణముగా లేళ్ళను, దుప్పులను, అడవిపందులను, పశువులను, గుఱ్ఱములను, లొట్టియలను తిని జీవించును. ఇతర ఘాతుకమృగములకంటె సింహములు సుకరముగా మచ్చికయగును. అవి బోనులలో నిర్బంధించియుంచినప్పుడుకూడ పిల్లలను పెట్టును. అవి నూటయెనిమిది దినములు గర్భము ధరించియుండును. పుట్టినప్పుడు పిల్లలు కన్నులు తెఱచియే యుండును.

సింహము మొదలైన పిల్లిజాతి జంతువులన్నియు తామొక మనుష్యునిగాని యితరజంతువునుగాని పడఁగొట్టినప్పుడు తామావిజయముతో తృప్తినొంది, ఆమనుష్యుఁడు పాఱిపోవుటకుఁ బ్రయత్నము చేసినప్పుడు తప్ప నితరసమయములయందుఁ గొంతసేపటివఱకును మఱియేహానియుఁ జేయక యూరకుండును; జంతువు తప్పించుకొని పోఁజూచినపక్షమున, కొన్నిగాట్లువేసి మరల దానిని భూమిమీఁద పడవై

చును ఈజాతిజంతువులకుఁగల యీగుణమునుబట్టి యనేకమనుష్యులు శాంతతతో సహాయము వచ్చువఱకును వేచియుండిగాని మెల్లగా తమయాయుధములను పైకెఁదీసి యాక్రూరమృగమును హతము చేసిగాని తమ ప్రాణములను కాపాడుకొనఁగలిగినారు. ఈప్రకారముగా సింహమునుండి తప్పించుకొని బ్రతికివచ్చినవాఁడొకఁడును, హిందూదేశమునందు పులినుండి తప్పించుకొని బ్రతికివచ్చినవాఁడొకఁడును తమ్మాజంతువులు పట్టుకొన్న సమయములో నొప్పిగాని భయముగాని లేక సర్వమును జూచుచున్నను మత్తుమందు వేసికొన్నవారివలె నిశ్చేష్టులయి యున్నట్టు చెప్పినారు. ఈహేతువునుబట్టి దయామయుఁడైన యీశ్వరుఁడు మరణసమయమునందట్టి జంతువులకు బాధలేకుండునట్లేర్పాటు చేసియున్నాఁడని చెప్పుచున్నారు.

పెద్దపులి.

ఆఫ్రికాఖండమునందు సింహమే మృగరాజయి సమస్తారణ్యములలోను సమస్త మృగములమీఁదను సర్వాధికారము చెల్లించుచున్నను, ఆసియాఖండమునందుమాత్రము దాని నిరంకుశాధికారమును చెల్లనీయక యంతపరిమాణమును బలమును చులుకఁదనమును గలిగి తానుగూడ మృగరాజ్యభాగమును బొందఁజూచు పెద్దపులియను మఱియొకజంతువు గలదు. అది ధైర్యమునందు సింహమునకించుక తీసిపోయినను బలమునందు దానిని మించునని పలువురు జంతుశాస్త్రవేత్తలు చెప్పుచున్నారు. అది శరీరసౌందర్యమునందు సింహమును మించుననుటకు లేశమయినను సంశయము లేదు. దానికి బంగారువంటి నిగనిగలాడెడు పచ్చని దేహమున నల్లనిచారలుండును.



ఈప్రక్కను వేయఁబడియున్న పటమువలన వ్యాఘ్రముయొక్క రూపమును చాలవఱకు తెలిసికొనవచ్చును. దాని కడుపు తెల్లగానుండి నిడుపులైన చాఱలక్కడ నడఁగిపోవును. తోకచుట్టును నల్లని యుంగరములు మనోహరముగా నుండును. పులి సాధారణముగా నడవులలో నెత్తైన గడ్డిలో దాగియుండును. ఆగడ్డియాకులు దాని శరీరముమీఁది చాఱలను బోలియుండును గనుక గడ్డిలోనున్నప్పుడు పులియున్నదని యానవాలుపట్టుటయే దుర్ఘటముగా నుండును. వ్యాఘ్ర మంత బలముగల జంతువయినను తనబలము నది బహిరంగముగా నెదుటఁ

బడి చూపక దొంగతనముగా పొదలచాటుననుండి పొంచి చప్పుడుగాకుండ ప్రాకి వచ్చి యేమఱుపాటునఁ దాను పట్టుకొనఁదలఁచిన మృగముమీఁద దుమికి చంపును. పులి మిక్కిలి కాపట్యముగల జంతువు. అది మార్గములప్రక్కను నీటిపట్లకు సమీపమున దట్టమయిన పొదలో నొరులకు కనఁబడకుండ దాగియుండి యామార్గమునఁ బోవఁదటస్థించిన యదృష్టహీనుఁడయిన మనుష్యునిగాని జ తువునుగాని మీఁదఁ బడువఱకును తెలియకుండునట్లుగా నొక్క దుముకులోఁ బట్టుకొనును. దాని బలమయిన సాధనము కొడవండ్లవంటి వాఁడిగోళ్ళుగల పాదము. ఆపాదముతో సుత్తి పెట్టువలె నొక్క యడఁపడఁచినపక్షమున వృషభమువంటి పెద్దజంతువు సహితము తలదిమ్మెక్కి పడిపోవును. ఆపయిని హరి పంచాయుధములట్లు నఖపంచకము వాఁడి కత్తులకంటెను క్రూరముగా చర్మమును మాంసఖండములతోఁగూడ చీల్చి రక్తనదులను ప్రవహింపఁజేయునప్పుడిఁక దానిఫలము చెప్పవలసినదేమున్నది?

పులి భుజములవద్ద మూఁడునాలుగడుగుల యెత్తుండును. దానిపొడుగు తల మొదలుకొని తోఁక మొదటివఱకును ఆఱేడడుగు లుండును. తోఁక మూఁడడుగు లుండును. తోఁక కలుపుకొని పండ్రెండడుగుల పొడుగుగల పులులు సహితము కొన్ని కానఁబడినవి. ఆఁడుపులులు మగవానికంటె నొకయడుగు చిన్నవిగానుండును. పెద్దపులులు హిందూదేశమునందంతటను విస్తారముగాఁ గలవుగాని కడచిన యిరువది ముప్పది సంవత్సరములనుండియు ప్రతిసంవత్సరమును చంపుచుండుటచేత వాని సంఖ్య యంతకంతకు తగ్గుచున్నది. పూర్వము విస్తారముగా పులులుండెడు మధ్య పరగణాలయందును బొంబయిరాజధానిలోని కొన్ని భాగములయందును బంగాళములోని కొన్ని ప్రదేశములయందును అరణ్యములలో నిప్పుడు పులులు కనఁబడుటయే యరుదగుచున్నది. పులులు దుష్టమానవులవలె బహుభార్యాత్వము నాసింపక జీవితకాలములో నవి యొక్కయాఁడుదానితోనే తృప్తినొందియుండును. వ్యాఘ్రి యొక్కొక్కసారి రెండుమొదలుకొని యైదింటివఱకును పిల్లలనుపెట్టును. పులులు మూఁడేసి సంవత్సరముల కొక్కపర్యాయము గర్భముధరించును. అవి సాధారణముగా నొంటిగాఁగాని జంటలుగాఁగాని కానఁబడును. అయిదారింటికంటె నెక్కువగా నెప్పుడును గుంపుచేరి యుండవు. అవి పగలంతయు పరుండియుండి రాత్రిపడఁగానే బయలుదేరి యెరనిమిత్తమయి పెక్కుక్రోసులదూరము వఱకు సంచారముచేయును. అవి పగటిపూట కొండగుహలలోఁగాని నదులసమీపమున జమ్ముగడ్డిలోఁగాని చెట్టునీడను పొదలోఁగాని యుండును. పెద్దపులులు సింహములవలె నంతగా నఱవవు. సాధారణముగా పులులు లేళ్ళను, దుప్పులను, పందులను, కొన్ని

సమయములయందు పశువులను తిని జీవించునుగాని మనుష్యులుండు ప్రదేశముల కంతగా రావు. సింహములవలె నీ పులులును చెట్లెక్క నేరవుగనుక మనుష్యులు చెట్లపై కెక్కి వానిని తప్పించుకోవచ్చును. పదునెనిమిదడుగులయెత్తున చెట్టుమీఁద మాటొగ్గి యున్న యొక వేటకానిని పులిచంపినని చూచినవారొకరు వ్రాయుచున్నారు. అప్పుడది పదియడుగుల యెత్తుననున్న చెట్టుయొక్క యొకగుబ్బకొమ్మమీఁదికి ముందుగా దుమికి, తరువాత నక్కడనుండి పయికి మఱియొకదుముకు దుమికెనఁట! ఏనుఁగుపిల్లలమీఁద సహితము పెద్దపులు లొకానొకప్పుడు పడును. అయినను పెద్దజంతువుల మీఁదికిఁ బోయినప్పుడు వానికప్పుడప్పుడపాయముకూడ సంభవించుచుండును. అడవిపందుల మీఁదికిఁ బోయిన పెద్దపులులు కొన్నిసమయములయం దడవిపందులచేఁ జంపఁబడుటయు, కొన్నిసమయములయందు పందియు పులియుకూడ చచ్చుటయు సంభవించును. అడవిలో వేటాడుటమానివేసి కాలముగడచిన పులులుకొన్ని గ్రామసమీపమున వసించుచు, పెంపుడుపశువులను చంపుచుండును. వానికి గోమాంసమునందు రుచి యెక్కువగుటచేత నవి మేకలు గొఱ్ఱెలు మొదలయినవానిజోలికిఁ బోక యావులను గిత్తలను మందవిడిచి దూరముగా వచ్చినవాని నెత్తుకొనిపోవుచుండును. అవి కొన్నిసమయములయందు గుఱ్ఱములను లొట్టియలనుగూడ చంపును. అయినను గేదెలును దున్నపోతులును తిరుగఁబడి కొన్నిసమయములయందు పులులనే పొడిచిచంపును.

పులి యేదైన జంతువును పగలు పట్టుకొన్నపక్షమున, దానిశరీరమును కొంత దూరమీడ్చుకొనిపోయి యక్కడ పడవైచి, పగలు దానిజోలికిపోక సాయంకాలమైనతరువాత దానిని భక్షించుటకయి మరలవచ్చును. వ్యాఘ్రము సాధారణముగా తానుజంపిన జంతువుయొక్క శరీరమును నీటిసమీపముననున్న యొక ప్రదేశమున కీడ్చుకొనిపోయి యక్కడ దానిని పొదలలోనో యాకులక్రిందనో దాచి, తానొక చేరువపొదలోఁ గూరుచుండి శవభక్షణమునకయి వచ్చెడు నక్కలు గ్రద్దలు మొదలయినవానిని మధ్యమధ్య తఱిమివేయుచు, ప్రొద్దుగ్రుంకువేళవచ్చి మొట్టమొదట జంతువును కడుపువద్దనుండి తినుటకారంభించి, నడుమనడుమ పోయి నీరుద్రాగి వచ్చుచు, ఎద్దువంటి పెద్దజంతువును మూడుదినములలో పూర్ణముగా భక్షించును. అటుతరువాత నాపులి రెండుదినములవఱకు మేతకయి ప్రయత్నింపక పడియుండును. కాఁబట్టి గ్రామముల సమీపమున పశువులను పట్టుకోమరగినపులి యైదేసి దినముల కొక్కొకపర్యాయ మొకయావునో యెద్దునో చంపుచుండును. వయసుమీఱిన వానికంటె లేతపులు లధికహానికరములయి యొకమందమీఁద పడినప్పుడొక్కసారియే యనేకపశువులను చంపి పాఱవేయును. అరణ్యములలోనుండి లేళ్ళు మొదలయినవా

నిని పట్టుకొనుచుండెడు నట్టిగాని గ్రామసమీపములనుండి పశువులను పట్టుకొనుచుండునట్టిగాని పులులు మిక్కిలి పిఱికివై మనుష్యులను జూచినప్పుడు భయపడి పాఱిపోవును. పశువులను పట్టుకొన్నప్పుడు కొన్ని స్థలములలో పసులకాపరిబాలకులే పులిని రాళ్ళువిసరికొట్టి పాఱఁదోలుచు వచ్చిరి. పిల్లలను బెట్టినప్పుడుగాని గాయపడినప్పుడుగాని పులుల కీభీరుత్వము పోయి యవి యప్పు డాయుధపాణుల గుంపుమీఁదసహితము పడి యవార్యశౌర్యమును చూపి యనేకులను రూపుమాపును. అయినను మనుష్యభక్షకములయిన పులులవలన మనుష్యుల కధికాపాయముగలదు. క్రొవ్వి బలిసి పరుగెత్తలేనివిగాని, ముసలివిగాని, గాయపడి వికలాంగములయినవిగాని, సాధారణముగా మనుష్యభక్షకము లగును. పులి యొక్కసారి మనుష్యుని పట్టుకొఁగలిగెనా, అది యింక సులభసాధ్యుఁడయిన మనుష్యునివిడిచి మఱియొక జంతువుమీఁదికి పోదు. ఇట్లు నరమాంసము రుచిపడి మనుష్యులను పట్టుకొ మరిగిన పులి మనుష్యులపాలిటి మృత్యుదేవతగా నుండును. ౧౮౬౦-౬౬వ సంవత్సరముల మధ్య మనుష్యభక్షకములయిన కొన్నిపులులు బయలుదేరి యొక్క దిగువబంగాళా దేశములోమాత్రము ర ౪౧౮రు మనుష్యులను జంపినవి. పశువులకును మనుష్యులకును సంభవించెడి యీపులిబాధను నివారణముచేయుటకయి దొరతనమువా రాయాదేశముల స్థితినిబట్టి పులిని జంపినవారి కయిదురూపాయలు మొదలుకొని యేఁబది రూపాయలవఱకును బహుమానము నేర్పఱిచియున్నారు. ఈబహుమానములకాశపడి వేటగాండ్రు పులులను వేటాడి చంపుచుందురు. పులులనుచంపెడు మార్గములనేకములు గలవు.

కొందఱు పెద్దపులి తానుచంపిన జంతువును పడవేసిపోయిన స్థలమునకు చేరువనుగాని, తామేదూడను తెచ్చి దానిఁ కట్టినపొదకు చేరువనుగాని, అనుకూలమయినచెట్టుమీఁద మంచెవేసికొని దానిలోఁగూరుచుండి వేచియుండి చచ్చిన జంతువును తినుటకుఁగాని బ్రతికియున్న దూడను పట్టుకొనుటకుఁగాని పులి యక్కడకు వచ్చినప్పుడు చెట్టుమీఁదినుండి గుఱిచూచి విషబాణములను విడిచియో తుపాకి కాల్చియో చంపుదురు. కొన్నిచోట్ల గోతులుత్రవ్వి గోతులలో మధ్యను వాడియైన మొనగల వెదురుగసికను పాతి పులి దానిమీఁద పడునట్లు చేసియు, చాపరాళ్ళు వ్రేలాడఁగట్టి యవి పులిమీఁద పడునట్లుచేసియు, నానావిధముల కొండవాండ్రు మొదలయినవారు పులులను చంపుదురు. పులిని బ్రదికియుండఁగాఁ బట్టుకోఁదలఁచినవారు వలలువేసియు, బోనులొగ్గి లోపల మేకనో దూడనో కట్టి పులి దానినిమిత్తమయి పోయినప్పుడు తలుపు పడునట్లుచేసియు, పట్టుకొందురు. వినోదార్థముగా

వేటాడఁదలఁచిన రాజులు మొదలయినవారు ఏనుఁగులమీఁద నెక్కిపోయి డప్పులవాండ్రచేత పులి తామున్నస్థలమునకు వచ్చునట్లు తోలించి యంబారీలలోనుండి గుండుదెబ్బతో చంపుదురు. దెబ్బతగిలినతరువాత పులిపాఱిపోక ప్రాణములకు తెగించి యేనుఁగులమీఁదపడియు మనుష్యులమీఁద దుమికియు మహాశౌర్యమును జూపునుగనుక పులివేట యెప్పుడును మిక్కిలి యపాయకరమయినదే. పులిపిల్లలను చిన్నప్పటి నుండియు పెంచినపక్షమున, అవి మచ్చికపడును గాని యేమఱియున్నయెడల వాని పాత్తెప్పడయిన విపత్తును దెచ్చును.

పులులలో నల్లవియు తెల్లవియుకూడఁ గలవుగాని యవి మిక్కిలియరుదుగా నున్నవి. హిందువులలో కొన్నిజాతులవారు పులులను దేవతలనుగా నెంచి పూజింతురు. మఱికొందఱు మూఢులు తమ మంత్రప్రభావముచేత మనుష్యులు పులులుగా మాఱుదురని నమ్ముదురు. అనేకులు పులిగోళ్ళు మీసాలు మొదలైనవి వశ్యౌషధములుగా నుండునని యెంచి దేహమున కట్టుకొందురు. పులిగోళ్ళు దేహముననున్న పులిభయమెప్పుడును కలుగదనియెంచి రాజులు మొదలైనవారు పులిగోళ్ళకు పెట్టి యాభరణములు చేయించి మెడలోవేసికొందురు. వ్యాఘ్రాజినములమీఁద తపస్సుచేసిన యెడల గొప్పసిద్ధులు కలుగునని భ్రాంతిపడి మంత్రవిశ్వాసముగలవా రెంతవెలయైనఁబెట్టి పులితోళ్ళను కొందురు. కొందఱు పులినెయ్యివలన వాయువునొప్పులు పోవునని తలఁచి దాని క్రొవ్వును కొందురు. పులిక్రొవ్వాయుధములకు మెఱుఁగుపెట్టుటకు మిక్కిలి యుపయుక్తము. ఈహేతువులనుబట్టి వేటాడువానికి దొరతనమువారిచ్చు బహుమానముగాక యితరలాభము సహితము దొరకును.

పూర్వమొకప్పు డొకగొప్పపులి యీ హిందూదేశమునుండి యింగ్లండునకుఁ దీసికొనిపోఁబడినది. అది యొకసింహమున్న బోనుసమీపమున బోనులోఁ గట్టఁబడి యున్నప్పుడు ప్రమాదవశమున రెండుబోనులకును నడుమనున్న తలుపు విడిపోవుట తటస్థించినది. అప్పు డవి రెండును పోరాడఁగాఁ గట్టకడపట పులియే సింహమును జంపఁగలిగినది. ఇంతమాత్రముచేత పులులు సింహములను జంపఁగలవని చెప్ప వలను పడదు. పోరాడువానియొక్క బలాబలములనుబట్టి సింహము పులినైనను పులి సింహమునైనను జంపవచ్చును. పొలములలోని పయిరులను పాడుచేసెడు లేళ్ళను పందులను జంపుచుండుటవలన నొకవిధముగా సింహములును పులులును మనుష్యులకుపయుక్తములే. పులులు పదునాలుగు పదునైదు వారములు గర్భమునుధరించి పిల్లలనుపెట్టును. పులి యీనినప్పుడు తనపిల్లలనే తినునని కథలుకలవుగాని యవి సత్యములుగావు. చంపినతరువాత నొకపులిని మఱియొకపులి భక్షించును. [సశేషము.]

కం. వీరేశలింగము.

మృచ్ఛకటికము. (౧౦౬- పుట శేషము.)

ఇది శ్రీమదిష్టదేవతా వరప్రసాదాసాదిత కవితావనితాధురంధర సౌజన్య బంధురాపస్తంబసూత్రపవిత్ర త్ర్యార్షేయ హారితగోత్ర సమస్తమండలతోష్టూయమాన వావిలాలాహ్వయ త్రిలింగజ వైదికాన్వయ కమలాకర ప్రభాకరాయమాణ శ్రీమహాలక్ష్మీ పదాప్పయ్యశాస్త్రీశ్వర ద్వితీయపుత్ర సకలగురుజన సదాశీఃపాత్ర వాసుదేవశాస్త్రిచే ననూదితంబగు మృచ్ఛకటికమునందు మదనికా శర్విలకమను చతుర్థాంకము.

పంచమాంకము.

[అంతటఁ జారుదత్తుఁడు సోత్కంఠముగా నాసనస్థుఁడై ప్రవేశించుచున్నాఁడు]

చారు—తే॥గీ॥ పురులు పైకెత్తియాడఁ జెంపుడు నెమళ్ళ
వగచి యంచలు మదినెంచ వలసపోవ
నంతరిక్షము కాలమేఘావృతము యి
దుర్దినము చేసి యుత్కంఠితుని హృదయము
తోడపీడెల్లఁ గప్పెను జూడు నేఁడు!

మరియు,

ఉ॥ తుమ్మెదలట్లు నీటితడి దున్నల పొట్టులపోల్కి నీలమై
యుమ్మగఁదాల్చి మెఱుపు ప్రభలీనెడు పీతపటోత్తరీయముల్
సమ్మతితో బలాకగణ శంఖము కేలధరించి చూడు మే
ఘమ్ము గడంగెఁ దా నలమఖమ్ముపరుండు త్రివిక్రముండునాఁ.

అనఁగా,

క॥ కేశవగాత్రశ్యామము
కాశాభ బలాకసంఘ కల్పితశంఖం
బై శోభిల్లెడు విద్యు
త్కౌశేయము మేఘమదిగొ ధరధరువరుసన్.

తే॥ గీ॥ జలదమధ్యస్థధారల జవముగంటె
దిగుచు క్షణశష్టదృష్టత దివ్యవహ్ని

దీపశిఖమెయి నీర్వండి దీప్తిఁగి
పుట్టిగునఁ జీలుపోఁగుల పోలికమర.

ఉ॥ సంగతిఁగూడఁగాను గవజక్కవ లొక్కడ నంచలొక్కడక్
రింగునఁబర్వఁగా మకరబృందము మీనము లబ్ధియుండి పై
కంగలుసాఁచునట్లోలయు హర్మ్యతలంబులు ప్రోచ్ఛ్రితంబుగా
భంగితమేఘపఙ్క్తి బహుభంగుల రూపములెత్తఁ జిత్రమై
నింగి యిదే కనంబడెడు నిక్కపుగాలికి మబ్బు నిల్చునే?

శా॥ మించెంగా ధృతరాష్ట్ర చక్రపువినుల్ మేఘాంధకారంబులై
ప్రాంచద్దర్ప సుయోధనుండువలెనే యార్చెక్ శిఖీంద్రమ్ము పై
నించెం ద్యూతజితిక్ యుధిష్ఠిరుగతిం దీనాస్యమై కోకిలం
బంచల్ పాండవులై వనుల్ వదిలె నిష్టజ్ఞాతచర్యక్ మనక్.

(పరికించి) మైత్రేయుఁడు వసంతసేనయొద్దకేగి చాలసేపయ్యెనే! ఇంకను రాఁడయ్యెను?

విదూషకుఁడు—(ప్రవేశించి) అహహా! ఏమి యీగణికకుంగల లోభమును అనౌదార్యమును! చూడు! ఇంకొక కథయే పల్కరింపదయ్యె! ఏమియుఁ బలుకకే యనాదరముతోఁప రత్నావలి నట్టెగైకొనెను! ఏమీలేకున్నఁ బోనీ! "అయ్యా మైత్రేయుఁడా! కూర్చుండవయ్యా! పంచిపాత్రెఁడు మంచినీళ్ళు (పానీయము) గ్రోలిపోవయ్యా" అని యీమాత్రపుమాటకుఁ గఱవయ్యెనే! కనుక దాసిపట్టియగు నీ సానెచాన మొగమింకఁ జూచిన నొట్టు చూడు! (నిర్వేదముతో) కాఁబట్టియే పెద్దలుచెప్పెదరు— దుంపలొమొలవని తామరతీఁగయు, వంచనలేని వణిజుఁడును, దొంగిలని సొన్నారియుఁ, బోరులేనియూరిఱచ్చయు, లోభమెఱుంగని గణికయు—నొరుకుట దుష్కరమని. చాలు! నా ప్రియవయస్యునిఁ జేరఁజని యింతటితో గణికాప్రసంగము వదులుకొనెదను! ఏమీ! నాకూర్మిచెలికాఁడు వృక్షవాటికలోఁ గూర్చున్నాఁడా? అచ్చటికె యరిగెదను. (సమీపించి) స్వస్తి తమకు! తమరు వర్ధిల్లెదరుగాక!

చారు— (చూచి) ఓయీ! చెలియగు మైత్రేయుఁడు వచ్చినాఁడా? చెలీ! నీకు స్వాగతము! కూర్చుండుమూ?

విదూ—కూర్చుంటినయ్యా!

చారు—ఆపనిమాట చెప్పు!

విదూ—ఆకార్యమా వినష్టమయినది!

చారు—ఏమి! ఆమె రత్నావళిని గైకొనలేదా?

విదూ— మనకట్టి భాగ్యమేదీ! నవనళిన మంజులమగు నంజలితో మరల గైకొనియె నయ్యా!

చారు—ఇట్లయినం గార్యము వినష్టమంటి వేలోయి?

విదూ—వినష్టము కాకుండునే? పెట్టుపోఁతల కక్కఱకు రాకయుఁ జోరాపహృతమయి కొలంది విలువగల సువర్ణభాండము కారణముగాఁ జతుస్సముద్ర సారభూతమగు రత్నావళి సమర్పించితివి!

చారు—వయస్యా! అట్లుగాదు! అట్లుగాదు!

క॥ ఏ విశ్వాసము నూఁకొని
తా వెలగల నగమునింట దాచఁ దెగియెనో
యా వెలఁది దాని గరిమకు
భావింపఁగ సిద్ధి యొక్కఁ బ్రాతియె చెపుమా

విదూ—ఓయీ వయస్యా! ఇదిగో నాసంతాపమునకు రెండవ కారణమొకటి కలిగె వినవయ్యా! సఖీజనుల కన్నుసన్నలమెయి నాపై చీరయంచునఁ జెడమొగము గప్పుకొని నన్నదేలొకో యుపహసించినదయ్యా! నీపాదములపయిఁ దలయొగ్గి విన్నవించుచున్నాఁడను. బ్రాహ్మణుఁడనుగదా! నామాటలు నమ్మవయ్యా! కనుక నేఁటినుండియైనను పెక్కుప్రత్యవాయములు దెచ్చిపెట్టెడు నీవెలయాలి పొత్తువలన మనస్సును మలపవయ్యా! గణికయనఁగాఁ జెప్పులోదూరిన చిల్ల పెంకువంటిదిగదా? నొప్పిపెట్టినప్పుడయిన దానిఁ దొలఁగింపవలదా? మరియు, వినుమో మిత్రుఁడా! గణికలును హస్తులును గాయస్థులును భిక్షులును నమ్మించి సొమ్ము గోఁజెడుచాటులును గాడిదలును నివసించెడుపట్ల దోషమునకు వెదకుకొనవలెనా?

చారు—మిత్రమా! ఇపు డీపరివాదమంతయుఁ జెప్పితివి చాలులే! నాయవస్థను బట్టియే నివారితుఁడనైతినిగదా! చూడు!

క॥ తురగము వేగము పరుగిడఁ
జరణంబులు బలము సచ్చి జరుగని రీతిం
బురుషుని భావను లెందేఁ
దిరిగియు ఖిన్నత్వమున హృదిన్లయమొందున్.

ఇదిగాక, మిత్రుఁడా!

క॥ ఎవ్వని కర్థములుండునొ

యౌవ్వనికిఁ గాంత్య ధన సుహార్ద్యజనంబౌ
జవ్వని
(త్రిసంగోపల) కాదు! గుణసుహార్ద్యజనంబౌ
ఒవ్వని (ప్రకాశముగా)
యర్థము గొల్పడి
యెవ్వారవున నాపె విడువ కేమండఁగలఁ.

విదూ — (క్రిందుచూచుచుఁదనలో) నామాటలువించుఁ జూపులు పైకినిక్కించి నిట్టూర్పులు విడుచుచున్నాఁడు చూడు! ఈ తగులము వదులుకొమ్మని నేను జెప్పిన కొలఁది నితని కామెమీఁది యుత్కంఠ హెచ్చుచున్నట్లున్నదిగదా? కనుకనే కామము వామమని యాలోచించి పెద్దలు చెప్పినారు! ఓయీ చెలీ! ఆపెచెప్పిన మాటయిదిగోవిను? "నేఁటిప్రదోష (మునమాపు) వేళకు నేనచ్చటికి వచ్చెదనని చారు దత్తునిగారితో మనవిచేయవయ్యా" అన్నది. ఇదిచూడఁగా రత్నావళితోఁ దృప్తిపొందక మరిదేనినైన యాచింపవచ్చెడునేమొగదా!

చారు—మిత్రుఁడా! రానీ! పరితుష్టిఁబొంది పోఁగలదులే!

చేటుఁడు—(ప్రవేశించి) ఎవరు మనుష్యులు! అవతలఁబొండి! తొలఁగుఁడి!

ఉత్సాహ॥ కొండపిల్లువుచ్చి వానకుండ గుమ్మరింపఁగా
నెండువడ్డ వీపుతోలు హెచ్చుతేమఁ దడిసెనే!
చండవృష్టి యువకయుడిగి చల్లగాలి గొట్టఁగా
నిండునెమ్మనంబుప్రీలి నేను గంపమొందనే?

(వెఱ్ఱినవ్వునవ్వి)

ఉత్సాహ॥ ఏఁడుతూట్ల పిల్లగ్రోవి యింపుగుల్క నూదనే
యేఁడుతీగలార్వ వీణె హెచ్చరించి మీటనే
గాడిదలకు సిగ్గురాఁగ గానమెచ్చిపాడనే
తోడెనాకు నారదుండుఁ దుంబురుండు పాటలో?

వసంతసేన నన్నుఁ జేరఁబిల్చి "కుంభీలకా! నీవుచని చారుదత్తునిగారితో నా రాక మనవిచేయుము" నిగాఁదా నన్నాజ్ఞాపించినది. సరే! చారుదత్తుని యింటికిఁ బోయెదను! (నడచి ప్రవేశించిచూచి) అఁడుగో చారుదత్తుఁడు వృక్షవాటికలో నున్నాఁడు! ఇఁడుగో దుమకు వడుగుగూడ నున్నాఁడే?— అయినం జేరఁ జనియెదను. ఏమీ! వృక్షవాటికా ద్వారము వేసియున్నదే? కానీ! ఈ దుష్టబ్రహ్మచారికి సంజ్ఞచేసి చూచెదను! (అని ఒల్ల పె.కుటుండలను విసురుచున్నాఁడు.)

[సశేషము.]

82 వా- వాసుదేవశాస్త్రి.

అహల్యాబాయి. (౧౪౦-పుట శేషము.)

ఆమె తనక్రిందియుద్యోగస్థుల ననుకూలమయినవారిని నియమించెను వారి పనులను వారు చక్కగా నెరవేర్చుచుండిరి. ఆమె ప్రజలక్షేమమునుగూర్చి విచారించుచు దొంగతనమువలన జీవనముచేయు గోండులు భిల్లులు అను కొండజాతివారి క్షేమమునుగూడ నారయుచుండెను. సాధారణముగా మనజాతివారి ప్రభుత్వమునందు ధనికులు తమద్రవ్యమును రాజుగా రెప్పుడు తీసికొనెదరోయని మిగుల భయపడుచుందురు. కాని అహల్యాబాయిగారుమాత్రము తన ప్రజలు అనుకూలమయిన స్థితిలో నుండునట్లు పరిపాలించి వారియందిస్థితిని చూచినప్పుడు మిగుల సంతోషముచు పొందుచుండెను. ఆమె ప్రభుత్వమందు హానిమొదలగు దుర్మార్గకార్యములను చేయుప్రజలను బాగుగ శిక్షించి ప్రజలకు చోరభయము లేకుండజేసెను.

ఆమె పరిపాలనచేసిన ముప్పది సంవత్సరములలోను యుద్ధభయ మెన్నడును లేక ప్రజలు మిగులసౌఖ్యమునొందిరి. ఒకప్పుడుమాత్ర మితరులవలన భయముకలిగెను. ఉదయపురపురాజు (Rana) ఈమె దేశముపైని దండెత్తెను. కాని యీమెయొక్క బలమయిన సేనలచే జయింపబడి వెనుకకు మరలిపోయెను.

ఆమె ప్రతిదినమును రేపకడలేచి సమయోచిత కృత్యములను తీర్చుకొని కొంతకాలమువఱకు శాస్త్రములనువిని, బీదలకు దానములుచేసి బ్రాహ్మణులకు స్వయముగా భోజనము లిడుచుండెను. అనంతరము కాయగూరలతో నామె భోజనముచేయుచుండెను. భోజనానంతరము కొంచెముసేపు శయనించి రెండుగంటలకు తిరుగలేచి బట్టలుధరించి దర్బారునకుంబోయి సాయంకాలము ఆరుగంటలవరకును స్వయముగా రాజకార్య వ్యవహారములు జరపుచుండెను. మహారాష్ట్రులలో మర్యాదకుటుంబములలోనివారు తమ స్త్రీలను మహమ్మదీయులవలె పరదావెనుక బంధించక బహిరంగమయిన స్థలములలో సంచరించుట కియ్యకొనిరి. కాబట్టి యాపద్ధతి ననుసరించి అహల్యాబాయికూడ దర్బారులోం గూర్చున్నప్పుడు ముఖమునకు తెరవేసికొనటలేదు.

అనంతరము రెండుమూడు గంటలవరకును భోజనము పూజమొదలగునవి జరపి రాత్రి పదునొకండుగంటలకు నిద్రపోవును. ఆమెకాలములో గొప్పలగు కోటలు మొదలగునవి కట్టింపబడినవి. అందులో ముఖ్యముగా వింధ్యపర్వతములపైని వేయించిన రోడ్డు మిగులం బ్రసిద్ధిఁగాంచె. అదివరకు క్రమముగా లేని ఇందూరు పట్టణమును విశేషముగా వృద్ధిపరచెను.

ఆమె గుణసౌందర్యము మిగుల శ్లాఘనీయమయినను ఆమె శరీర సౌందర్యమంత విశేషమయినదికాదు. ఆమె సాధారణమయిన పొడవుగలిగి సన్నముగానుండును. ఆమెశరీరము చామనచాయ. ఆమె కులాచార పద్ధతుల నెన్నడు నతిక్రమింపక సాధారణముగా కులమువారు ధరించుబట్టలనే కట్టుకొనుచు ప్రభుత్వ సంపద కలిగినవారు ధరించునట్టి డాంబికమయిన దుస్తుల నెప్పుడును ధరించుటకు సమ్మతింపదయ్యె. ఆమె సాధారణమయిన వితంతువులవలెనే తెల్లబట్టలను ధరించి మెడలో బంగారపు పట్టెడతప్ప నితరవస్తువులు ధరించుటలేదు. ఆమె బాగుగ చదువనేర్చి పురాణములయందు ఘనమైన పాండిత్యమును కలిగియుండెను. ఆమెకును దంభమునకును చాలదూరము. ఒకప్పుడు తనవిషయమయి మిగుల స్తోత్రపాఠములు చేయుచు నొకబ్రాహ్మణుడు రచించిన పుస్తకమును ససాకల్యముగావిని తనకు నట్టిగుణసంపద లేదని చెప్పి యాపుస్తకమును సమీపమునందలి నదిలోఁ బారవేయుటకుత్తరువొసగి యాగ్రంథకర్త కేమియు సహాయము చేయదయ్యె.

తనయల్లుడు పోయినప్పుడు కొమార్తె సహగమనము చేయుటకుఁ బ్రయత్నించెను. వృద్ధురాలగు అహల్యాబాయి తననిమిత్తము జీవించవలసినదనియును, తనను దిక్కుమాలిన దానినిగా చేయవద్దనియును కొమార్తెను వేడుకొనెను. అందుకు కొమార్తె "అమ్మా! మీరుపెద్దలయినారు. కొద్దికాలములోనే మీ సచ్చరిత్రమువలన స్వర్గమునకుఁ బోయెదరు. నాకుఁగలయేకపుత్రుఁడును భర్తయునుకూడగతించిరి. మీరుకూడ గతించినపెనుక నాకీసంసారదుఃఖభార మతిశయమయి దుర్వగాహమైయుండును. కాఁబట్టి యీతరుణము దాటినయెడల నేను మర్యాదయైన మరణమును పొందుటకు సమయము దొరకదు." అనియుత్తరువిచ్చెను.

దృఢనిశ్చయురాలయిన కొమార్తెను చేయబూనినపనినుండి తొలగించుటకశక్తురాలయి, చితికడకుఁబోవు జనసమూహములోకలిసి తానుగూడ స్మశానవాటికఁ జేరెను.

ఇద్దరుబ్రాహ్మణులు చేతులతో నహల్యాబాయిని పట్టుకొని యోదార్చుటకుఁ బ్రయత్నించిరి. ఆమెకొమార్తె చితిపైనెక్కి వస్త్రాభరణములు మొదలగునవి బ్రాహ్మణులకొసగి శవభర్తయొక్క శిరస్సును తనతొడలపై నునిచి స్వహస్తములతో చితికి నిప్పునంటించెను- అక్కడకు జూడవచ్చిన జనులందరు నామె రోదనము బయలుపడకుండునట్లు బిగ్గరగా కేకలువేయసాగిరి- ఈ భయంకరమయిన సంగతిని చూచినతోడనే అహల్యాబాయిగారి మనస్థైర్యము చెడిపోయి కేకలువేయుచు మంటలలోనుండి తనకొమార్తెను బయటకుఁ దీయుటకుఁ బ్రయత్నపడెను. కాని బ్రా

హ్మణోత్తములు రెక్కలుపట్టుకొని యామెను కదలకుండఁజేసిరి. శీఘ్రకాలములో నే యామెకోమాశై బూడిదయైపోయెను.

అనంతరము బంధుజనులతోఁగూడి యామె నదియందు స్నానముఁజేసి, దుఃఖముతో నామెమందిరమును చేరెను. అనేకదినములవరకు విచారమగ్నురాలయి యితరులతో మాటలాడక కాలముగడపెను. పిమ్మట తనకోమాశైను దహనము చేసిన స్థలమున గోరీ నొకదానిని కట్టించెను.

ఆమె ప్రతిదినమును బీదల కన్నదానముఁ జేయుచుండెను. వేసవికాలమునందు బాటసారులకు దాహమునకుజలమిచ్చుటకు మార్గములందు మనుష్యుల నేర్పరచెను. చలికాలములో తననవుకర్లకును ఇతరులకును వస్త్రదానముఁ జేయుచుండెను. మృగములకును, పక్షులకును, చేపలకునుకూడ నాహారమొసగుచుండెను. హిందూదేశమందలి దివ్యస్థలములకు ద్రవ్యముఁ బంపుచుండెను. దక్షిణహిందూస్థానమందలి దివ్యస్థలములలోని విగ్రహముల యభిషేచనకొరకు గంగానదినుండి యుదకమును తెప్పించి పంపించుచుండెను. కాశీపట్టణమందలి విశ్వేశ్వరునియొక్కయు, గయయందలి మహాదేవునియొక్కయు ఆలయములామెచేతనే కట్టించబడెను.

అహల్యాబాయి ౧౭౯౫వ సంవత్సరమునందు ౭౦ సంవత్సరముల వయసులో మరణమునొందెను. ఆమెమతాచారప్రకార మామెజరుపు ఉపవాసముల వలనను, ఆమెకు సంభవించిన యాపదలవలని మనోవికలతలవలనను ఆమెదేహము శుష్కించి శల్యావశిష్టమయి శీఘ్రకాలములోనేయామెకుమరణముసంభవించెను. ఆమెమరణమునకై జనులందరును విశేషముగా దుఃఖించిరి. ఆమె ప్రతిమను సీతారాములవిగ్రహములప్రక్క నునిచి బ్రాహ్మణులందరు నామెను అవతారముగా భావించిపూజించుచుందురు.

ఆమె యనంతరము తుకాజీ రాజ్యమునకు వచ్చెను. తర్వాత రెండుసంవత్సరముల కాయన లోకాంతరగతుడాయెను. పిమ్మట దవులత్ రావు సింధియాగారారాజ్యమును బలవంతముగా స్వాధీనపరచుకొనఁదలఁచెనుకాని ఆయన ప్రయత్నములన్నియు విఫలములై తుకాజీగారి పుత్రుఁడగు జస్వంతరావు రాజ్యమునకు వచ్చెను.

రాజ్యమునకువచ్చిన స్త్రీలలో నహల్యాబాయిగారిని పోలినవా రనేకులు కానరారు. ఆమె దాతృత్వము మిగులశ్లాఘనీయమయినది. విశేషముగా విద్యలేకపోయినను, అహల్యాబాయిగారు రాజ్యపరిపాలన ప్రజానుకూలముగా నొనర్చి చిరమైన కీర్తిని సంపాదించి పరలోక గతురాలాయెను-

పద్మినియను రాజపుత్ర రాణి.

రాజపుత్రస్థానమందలి (Rajaputana) చిత్తూరుదేశమునకు ప్రభువగు భీమ్సీగారు మిగుల సౌందర్యవతియగు పద్మినియను స్త్రీని వివాహమాడెను. ఆమె రూపలావణ్యాతిశయములను, సుగుణసంపత్తిని, బలవన్మరణమును గూర్చి "రాజవారా" కథలలోఁ జెప్పబడియున్నది మనదేశమందు బొబ్బిలికథలవలె నాదేశమం దీమె చరిత్ర ప్రతిగృహమందును చెప్పుకొనబడుచుండును. ఢిల్లీ చక్రవర్తియగు అల్లా ఉద్దీను చిత్తూరుదేశముపై దండువెడలెను. అట్లు చేయుటలో నాయన ముఖ్యోద్దేశము సౌందర్యవతియగు పద్మినిని స్వాధీనపరుచుకొనవలెననికాని, జయాకాంక్షచేఁ గాదు. అనేక దినములవరకు కోటను ముట్టడివేసెనుకాని ఆయన ప్రయత్నములు విఫలములాయెను. తుదకు నద్దములద్వారా యామె ప్రతిబింబమునైనఁ జూపుటకు భీమ్సీగారిని వేడెను. రాజపుత్రునియందలి నమ్మకముచేతను కొద్ది పరివారముతోనే చిత్తూరు కోటను ప్రవేశించి తనమనోభీష్టమును నెరవేర్చుకొని మరలిపోయెను. రాజపుత్రుఁడుకూడ మహమ్మదీయుని యందలి నమ్మకముచే కోటచివరవరకును నొంటరిగాఁ బోయెను. రాజపుత్రుని కిటువంటి నమ్మకము కలుగచేసి తనతో నొంటరిగా తీసికొనుటకొరకే మొదట అల్లాఉద్దీను కొద్దిపరివారముతో కోటకుఁబోయెను. మహమ్మదీయులకంటె హిందువులు కడు విశ్వసనీయులన్న సంగతికూడ అదివరకే అల్లాఉద్దీను కనిపెట్టియున్నాడు. తన మాయోపాయము నెరవేరుటతోనే సహాయవిహీనుడైయున్న రాజపుత్రునిఁ ద్రోవలో వేచియుండు తార్తారభటులు పట్టుకొని ఖయిదుచేసి తార్తారపురాజుయొక్క గుడారమునకుఁ దీసికొనిపోయి భార్యయైన పద్మిని నొప్పగించినయెడలఁగాని రాజపుత్రుని విడిచిపెట్టమనిరి.

ఘోరమయిన యీవార్త వినినతోడనే చిత్తూరుదేశస్థులందరు మిగుల ఘూర్ణిల్లిరి. పద్మినిని విదేశస్థునకుఁ గానుకగా సమర్పించుటవిషయమయి యాలోచింపఁదొడగిరి. ఈసంగతి నామెకుఁ దెలియపరచగా నందులకామె సమ్మతించెను. ఆమె యపకీర్తిపాలయి పోకుండునటులఁ జేయుటకు నామెపినతండ్రియగు "గోరా" గారితోను, మేనల్లుడగు బరోడాగారితోను మంతనముఁజేయగా వారొక యుపాయము నాలోచించిరి.

[సశేషము.]

ఆ. సుందరరామయ్య.

జయద్రథనాటకము. (౧౩౬-పుట శేషము.)

జయ— దేవర నామనవి వినుండు. నాకొమార్తె యీతని పెండ్లియాడుట కెంత మాత్రమయినను, ఇష్టపడి యుండినయెడల నేనాతని దూషించినందుకు నన్ను నిందింపుడు—

అమ్మాయీ! గా. ఈసభలోని జనులందరిలోను నీవెవరి కెక్కువమర్యాదయు ప్రేమయు చూపించుటకు బద్ధురాలవైయున్నావు?

గుణవతి— ఘనతగల నాతండ్రీ! ఈయెడ నాప్రేమయు గౌరవమును భాగింపబడినవి. నన్ను పెంచి పెద్దదానినిగా జేసి విద్యాబుద్ధులు నేర్పినందుకు నాప్రేమమీకు జూపవలసియున్నది. ఇదివరకు నేను మీకుమారిని. అయిన నిక్కడ నాపెనిమిటియు గలడు. నాతల్లి తనతండ్రిముందర మీకెంతమర్యాద చూపించుచుండెనో, అంతమర్యాద నేనిప్పు డీతనికి చూపవలెను.

జయ— నిన్ను భగవంతుడు రక్షించుగాక! ఇక్కడకైనది— ఇక రాజకార్యాలోచనచేయుడు. పిల్లలను కనుటకంటె పెంచుకొన్న బాగుండును. జయద్రథా దేనిని నీవిదివరకె గిల్గియుంటివో, దేనిని నేనిదివరకు నామనస్ఫూర్తిగా నీకియ్యకుంటినో, అట్టి నాకూతు నీయెడ నీకు నామనస్ఫూర్తిగా నిచ్చుచున్నాను. ఓ సుందరీ! నాకు మరియొకకూతురు లేనందుకు పరమానందంబు నొందుచున్నాను. ఏలనన గుదిగ్రలు గట్టవలసివచ్చిపోవును.

రాజు— ఈ నూతనదంపతులు తిరుగ నీయనుగ్రహమునకు పాత్రులగునట్లు, నన్ను కొన్నిమాటలు చెప్పనిమ్ము.

క॥ మందులు గుణహీనములై
యుండినతరి చావు వేచుచుండుట వలనన్
డెందమున గలుగుదుఃఖము
మందంబగు నిశ్చయంబు మనుజులకెల్లన్.

క॥ గడచినకీడునకై మది
నడలుట తనపైన నూత్నమగు దుఃఖంబున్
బడవైచికొనుట గనుకనె
యెడయగు దోసగులను బుద్ధినెంచరు పెద్దల్.

క॥ ఓరిమిగల నరునకు చే
కూరిన దురదృష్టవశత గొప్పలుదొసగుల్
వీరము●చెడి కుందక పలు
మారులు హాస్యంబుచేయు మనము దలిర్పన్.

గీ॥ దొంగిలింపబడియు దాసగునకైనవ్వు
నతడు దొంగవాని నరయ దొంగి
లించు, లేనిదానికేయేడ్చు నాతడు
దాడరి తన్నుతానె దొంగిలించు.

జయ— ఈతీరుననే లక్షద్వీపము మల్కులకిచ్చి మనమూరకుందము. మనము నవ్వు చున్నంతకాలము మనకు నష్టములేదు.

గీ॥ ఇట్టి సామెతలకు పుట్టి కష్టంబుల
నెన్నడైన నెరుగకున్నవాడు
సంతసిల్లుగాని వంతగుండెడు నాత
డుల్లమవియ నేడ్వకుండగలడె.

ఏలనన బలహీనమగు శాంతమను తెప్పను నాశ్రయించి దుఃఖసాగర నిమగ్నుం డు గాకయున్న మానవుండే తాదృశ నీతివాక్యజనిత విచార ఝంఝామారుత వేగంబున కాగుట బహుకష్టంబు! ఇంతియగాక నీసామెతల నెట్లయిన నుప యోగింపవచ్చును. ఎన్నిచెప్పినను మాటలు మాటలే. ఇదివరకు నేనెన్నడును విచారగ్రస్తమయిన మనస్సుయొక్క తాపము పొడిమాటలవలన విచారమును మానుటచూడను.

రాజు— జయద్రథా! మల్కులు గొప్ప నావికసైన్యముతో లక్షద్వీపములను పట్టు కొనుటకు బోవుచున్నారు. అక్కడగల మనోరంజనుడును ధైర్యవంతుడే యైనను నిన్నీపనిని నెరవేర్చుటకు పంపవలసినదని మనవారియభిప్రాయ మగుటవలన తత్క్షణము నీవాకడకేగవలయును. నీకిప్పుడుకలిగిన నూత్నసంతోషమునకు భం గము తటస్థించినందుకు సంకోచింపకుము.

జయ—దేవరయాజ్ఞ శిరసావహించి యీక్షణమందె పోవుచున్నాను. నాకు సం గరభూములె పుట్టినిళ్లగుటవలన యుద్ధంబుల కేగుటకన్న నాకు మరిసంతోష మెద్దానియందును లేదు. నాభార్యకుమాత్రము గౌరవమునకు తగిన నివాసాసుల నొసంగుడు.

రాజు—నీయిష్టమయినయెడల నామెతండ్రి యింటివద్ద నుండవచ్చును.

జయ—దానికి నేసమ్మతింపను.

జయద్ర—నేనును సమ్మతింపను.

గుణ—నేనంతకంటె సమ్మతింపను. ఆతని కన్నులముందు వర్తించుచు నాతనియా గ్రహమునకు పాత్రురాలనౌటకు నేనిష్టపడను. దేవర నామనవి కించుక చెవి

యొగ్గివిని నాజేలతనమును మన్నించి నాకోర్కెను సఫలముచేసెదరని నమ్ముచున్నాను.

రాజు—నీవేమికోరెదవు? గుణవతీ!

గుణ— నేనుచేసిన సాహసమును పడినకష్టములను గాంచినయెడల నే నీతడున్నయెడ నివసించుటకే యీతనిపెండ్లియైతినని మీకందరకు స్పష్టమగును. ఈతని ధైర్యస్థైర్యములను మనోనిశ్చలతయు గాంచి యీతననే వరించితిని. అతండు యుద్ధంబులకేగి నేనొంటరి యింటవసించితినేని నేనీతని నేగుణములజూడ కామించితినో ఆగుణముల జూడగల్గను. ఇదిగాక నాకీయెడ దినమొకయేడుగా నుండును. గాన నన్నునూ, ఈతనితో బోనిండు. ఇదియ నాకోరిక.

జయద్ర—ఆమెనునావెంట గొనిపోవుట నాశరీరసౌఖ్యమునకనిగాని, యామెతోడ నుండుటవలన రాజకార్యములు పాడుచేయుదుననిగాని మీమనస్సున తోచకుండునట్లు భగవంతుడు రక్షించుగాక!!

రాజు— ఆసంగతులన్నియు మీర ధృవపరచుకొండి— మీయిష్టమువచ్చినట్లు ప్రస్తుతకార్యమునకు తగినంతత్వరగా పూనుకొనవలయును.

౧. మంత్రి—నీవీరాత్రి బయలుదేరవలెను.

జయద్ర—ముఖ్యముగా బయలుదేరెదను.

రాజు—రేపు ఉదయము తొమ్మిదిగంటలకు మేము తిరిగి సభచేసి నీకు పంపవలసిన వర్తమానముల నంపెదము. గాన నీవొక్క యుద్యోగస్థుని వెనుక దిగబెట్టుము.

జయద్ర— చిత్తము. కలహప్రియుడు మిక్కిలి కన్కకము యినవాడు. ఆతనినుంచెదను. నాభార్యయు నాతనితో నాకడకేగుదెంచును.

రాజు— మంచిది.— (లేచుచు) ఈరాత్రి అందరు సుఖనిద్ర ననుభవింతురుగాక! జయలోలా! సద్గుణవంతు డితరదేశీయుడైనను పూజార్హుడైనయెడల నీయల్లుడు తగినవాడే!

౧. మంత్రి—జయద్రథా! నీకు శుభమౌగాక! గుణవతిని బాగుగా ప్రేమింపుము.

జయ—జయద్రథా! నీభార్యను రెండుకన్నులతోను చూడవలెను. ఇక్కడకు తండ్రిని మోసపుచ్చినది. నీయెక్కువయేమి? నిన్నును మోసపుచ్చవచ్చును.

(రాజు మంత్రులు &c. నిష్క్రమించెదరు.)

జయద్ర— నాభార్యయు నాప్రాణము నొక్కటిగా చూచెదను! సన్మార్గుడవైన కలహప్రియా! నాగుణవతిని నీవుతోడ్కొనిరమ్ము. దానికి తగిన యుపచారము నీభార్యను చేయుమని నియమింపుము. బహుజాగ్రతగా తోడ్కొనిరావలె

సుమా! ప్రియసఖీ రమ్ము. ఇంక నీతో కొంచెముకాలము మాత్రమే మాట్లాడ వచ్చును. కాలమునుబట్టి నడచుచుండవలెను.

[జయద్రథుడును భార్యయు నిష్క్రమించిరి.]

కామపాలుడు— కలహప్రియా—

కలహ—మిత్రమా! ఏమిచెప్పెదవు?

కామ—నేనిప్పు డేమిచేసెదని యోచించెదవు?

కలహ—ఏమి? పక్కపైపరుండి సుఖముగా నిద్రపోయెదవు.

కామ—ఈక్షణమందే చెరువులోపడి ప్రాణత్యాగ మొనర్చెదను.

కలహ— అట్లొనర్చితివేని పిమ్మట నిన్ను నా ప్రాణస్నేహితునిగా ప్రేమించను— కారణమేమి?

కామ—ఇంతవ్యసన మనుభవించుచు జీవించుటకంటె త్వరితముగా దేహత్యాగము చేయుటే మేలు.

కల— ఛీ! తెలివితక్కువ! ఇదివరకు నేనిరువదెనిమిది యేడులనుండి ప్రపంచము చూచుచున్నను, తనసంగతి తాను బాగుగా జాగ్రత్తపెట్టుకొనగలవానిని చూడను. నేను నీవలె నొక రంకులాడికొరకు ప్రాణత్యాగము చేయుదు ననుటకు ముందొక మృగమునై పుట్టెదనుసుమా!

కామ— నేనిప్పుడేమి చేయుదు? నేనే యొప్పుకొనియెదను. నా ప్రేమ మిక్కిలి యెక్కువ. నేను ప్రేమించినది దొరకకుండినయెడల ముఖ్యముగా ప్రాణత్యాగమే చేయుదును. నాకుగల సుగుణములలో నొక్కటియు ఈతొందర మరలింప జాలదు.

కల—సుగుణములా! నిరర్థకములు! అంతయును మనసులోనున్నది. మనశరీరములే ఒకవిధమయిన తోటలు. మనయాలోచనలే తోటకాపరులు. ఆతోటలో మనము కసెంతలు వేసినను నేపాళములునాటినను లేక పూలమొక్కలువేసి నింపినను—అంతయు మనయిష్టములోనేయున్నది. ఆతోటలను సోమరితనముతో మందకట్టవచ్చును లేక పాటను పెంటవలన నింపవచ్చును.— దేనికైనను మన బుద్ధియే ప్రధానము. మనశరీరములను త్రాసులలో కామాది దుర్గుణములుండు చిప్పను పైకిలాగుటకు నాలోచనయను చిప్ప లేనియెడల మనస్థితి మిక్కిలి నిర్భాగ్యకరమయిన దగును. గనుక నీవిప్పుడు ప్రేమయని చెప్పుచున్నది నేను నిరర్థకమగు బుద్ధితక్కువయని పిలిచెదను.

కామ — అబద్ధము. [సశేషము.]

వల్లూరి-పద్మనాభరాజు

స్త్రీహితోపదేశము. (౧౮౮-పుట శేషము.)

గర్భోత్పత్తి యయినప్పుడు పళ్ళు విశేషముగా సలుపును. కొందరికి ప్రతి ప్రసవమునకును ఒక్కొక్క పన్ను ఊడును.

ఆకలి మందము.—గర్భోత్పత్తి యయినప్పుడు కొందరు స్త్రీల కాకలి యెంత మాత్ర ముండదు. అన్నహితము బొత్తిగా తప్పును. మఱికొందరికి విశేషముగా నాకలియుండి అమితముగా భోజనము చేయుదురు.

గర్భిణిస్త్రీకి చిరుతిండ్లయందుండు ఆసక్తి యస్వాభావికము. సాధారణ సమయములలో దగ్గిరకు రానియ్యని వస్తువులనయిన అప్పుడు మిక్కిలి యపేక్షతో పుచ్చుకొనును. గాని విశేషముగా తినుట మంచిదిగాదు.

సుకుమార స్త్రీలకు మనశ్చలనము మిక్కిలి తరుచుగా గలుగును. దుర్బలస్థితియందిది ముఖ్యముగా తటస్థించును.

గర్భిణిస్త్రీలకు జీర్ణకోశము సర్వదా బాగుగానుండదు. పుచ్చుకొను పదార్థములందిష్టానిష్టములు తరుచుగా నుండును. పచ్చనిమచ్చలు ముఖము మెడ యీ మొదలైన స్థలములందు గర్భోత్పత్తియైనప్పుడు తప్పక కనుపించును. గర్భోత్పత్తి చిహ్నములివి.

గర్భిణిస్త్రీలు వస్త్రములు ధరించుకొనవలసిన క్రమము.

స్త్రీలు గర్భవతులయినప్పుడు గర్భమందు దినదిన క్రమమున పెరుగుచుండెడి శిశువునకు తగినంత అవకాశము అవశ్యముగా కావలసియుండును గనుక అట్టి సమయములలో వస్త్రములు బిగించి కట్టుకొనకూడదు. చిన్నతనములో గర్భమయిన యెడల కొందరు స్త్రీలు సిగ్గుచేత నడుము బిగించి కట్టుకొనుచుందురు. ఇందువల్ల శిశువుకు అనుకూలమయిన అవయవస్ఫూర్తి కలుగకపోవుటయేకాక గర్భము దిగిపోవుట, నెలలు నిండకమునుపే ప్రసవమగుట, అక్రమప్రసవము, ఇటువంటి అపాయములు తటస్థమగును. కాఁబట్టి గర్భిణులయిన స్త్రీలు గర్భము వృద్ధియైనకొలది వస్త్రములు వదులుగా కట్టుకొనుచుండవలయును. బట్టలు బిగించికట్టుకొనెడు దురభ్యాసము స్త్రీలకు బాల్యమునుండియు కలిగియుండును. అది యెల్లప్పుడు జబ్బే. అందులో గర్భిణిగా నున్నప్పుడు మిగుల హానికరము. గనుక ఈ యభ్యాసము మొదటినుండియును కాకుండ చేసినయెడల మిక్కిలి మేలుగా నుండును.

గర్భమయినప్పుడు స్తనములుకూడ వృద్ధిపొందునని పైని వ్రాసియుంటిమి గనుక గర్భిణిస్త్రీలు రవిక తొడుగుకొనుటలోకూడ బహుజాగ్రతగా నుండవలెను. బిగువుగానుండు రవిక తొడిగికొనినయెడల స్తనములు క్రమముగా వృద్ధిపొందక ప్రసవమయినతరువాత శిశువుకు స్తన్యము ఉండదు.

స్నానక్రమము.

విశేషముగా వేడినీళ్ళు పోసికొనకూడదు. సామాన్య ఉష్ణతగల నీళ్ళతో వారమునకొకసారి స్నానము చేయుట మంచిది. ప్రతిదినము ఉదయమున గోరువెచ్చని నీళ్ళలో గుడ్డ తడిపి శరీరమంతయు తుడుచుకొనుట అభ్యాసము చేసికొనవలెను. చన్నీళ్ళతో శరీరము కడుగుకొనుట ఉత్తమపక్షము. చెరువులకు వెళ్ళి మునిగి శిరస్స్నానము చేయుటగాని కంఠస్నానము చేయుటగాని తటస్థించినప్పుడు నీళ్లలో చాలసేపు నానకూడదు. నీళ్ళలో కొంచెముసేపు కూరుచుండి ముతకగుడ్డతో దేహమంతయు తోముకొని కడుగుకొనవలెను. గర్భిణిస్త్రీలు సముద్రస్నానము చేయకూడదు. సముద్రోదకము తెచ్చి దానితో శరీరమంతయు తడిపి తుడుచుకొనుటవలన అనుకూలమైన ఆరోగ్యము కలుగును. ఇంటివద్ద స్నానము చేసినప్పుడైనను మరియొకచోట స్నానము చేసినప్పుడయినను అత్యుష్ణముగా గాని అతిశీతలముగా గాని ఉండెడునీళ్ళు పనికిరావు

గాలియు శరీరసాధకమును ఆవశ్యకములు.

గర్భిణిస్త్రీలు ముఖ్యముగా ప్రథమగర్భములో విశేష శరీరాయాసమును కలుగ చేసికొనగూడదు. అట్లని చెప్పి పదచలనము లేకుండ కూరుచున్నచోటనే కూరుచుండి యుండకూడదు. పరిశుద్ధమయిన వాయువును ఆస్వాదించుచు మితమైన పరిశ్రమ చేయుచు నుండవలెను. ఇట్లు చేయుచున్నయెడల గర్భిణికాలమందు తరుచుగా సంభవించెడి యిబ్బందులు తటస్థించవు. మంచిశరీరారోగ్యము కలిగియుండును. కాలప్రవృత్తి అనుకూలముగా అగుచుండును. మంచిగాలి, శరీరపరిశ్రమ, ఉన్నయెడల గర్భిణులు బహుసుఖముగా ప్రసవము అగుదురు. ఇందుకు దృష్టాంతము, విశేష దేహపరిశ్రమచేయు కూలివాండ్ర స్త్రీలు మిక్కిలిసులభముగా ప్రసవమగుదురు. స్థితిమంతుల స్త్రీలకు ప్రసవమనిన పునర్జన్మముగా కనబడును.— గర్భిణులు విశేషము వంగుట, బరువులెత్తుట, కాళ్ళు ఎత్తి పైగానున్న వస్తువును అందుకొనబోవుట, పరుగెత్తుట, ఇట్టిపనులు చేయకూడదు. ఇవి గర్భస్రావమును కలిగించునుగనుక బహుజాగ్రతగా నుండవలెను.

గర్భిణిస్త్రీలు తరుచుగా సోమరులై యుందురు. గర్భముకాగానే రోగిష్ఠులవలె ఒకచోట కూరుచుందురు. ఇట్లుండుటచే విశేష బలహీనత కలుగుటయేకాక పుట్టబోవు బిడ్డకూడ మిక్కిలి నీరసముగా నుండును. కాబట్టి పగటిభాగమందు విశేషము ఆయాసముగానుండినగాని విశేషకాలము నిద్రపోవుచుగాని ఊరకగాని పరుండియుండకూడదు.

సోమరితనముచేత నెల్లవారికిని నష్టమే. బద్ధకునికి పనియొక్కువ అని మనలో నొక సామెతకూడ గలదు. అలాగుననే గర్భిణులు సోమరులుగా నున్నయెడల వారికి ప్రసవబాధ విశేషముగా నుండుటయు కలుగుబిడ్డలు నీరసులుగాను అనాకారులుగాను అనారోగ్యము గలవారుగాను ఉండుటయును సంభవించును. కావున గర్భిణిస్త్రీలు కేవలము సోమరితనముచే కాలక్షేపముచేయక, గృహకృత్యములు మొదలైన పనులలో శరీరమునకు కొంతపరిశ్రమ అనగా అలసటను కలుగచేయుచు ఉండవలెను.

మరల దినమునకు రెండుగంటలసేపు అనగా అరగంటచొప్పున నాల్గుపర్యాయములు మంచముమీద విశ్రమించుటయును విధాయకమే. ఈవిశ్రమించుట గర్భిణి అయినది మొదలుకొని ప్రసవించువరకు జరుగతగినదే. అయిన ఆపరుండుటలో బహుజాగ్రతగా చాలీసు దిండ్లు మొదలయినవి ఉంచుకొని ఆయాసము లేకుండ పరుండవలెను.

ఇండ్లలో పరిశుభ్రతనుగురించి.

ఇంటిలోనికి ముఖ్యముగా పడకయింటిలోకి మంచిగాలి వెలుతురు వచ్చునటులు చేసికొనవలెను. మనవారు సాధారణముగా గాలితగులగూడదని చెప్పి తలుపులన్నియు వేసికొనిపరుండుట, మొదట కిటికీలే ఉంచకపోవుట, ఇట్టిఅనారోగ్యకార్యములు చేయుచుందురు. పరిశుభ్రమయినవాయువు వెల్తురును వచ్చు గృహములలో నివసించుటవలన కలుగు లాభములును అట్లు చేయకపోవుటవల్ల కలుగు నష్టములును మనవారికందరకును తెలియవు. ఈవిషయము ప్రథమాధ్యాయమందు వివరించి వ్రాయఁబడి యున్నదిగనుక ఇచ్చట మరల వివరింపనక్కరలేదు. గర్భిణిస్త్రీలు ఈవిషయమయి శ్రద్ధపుచ్చుకొని అనుకూలమయిన వాయుప్రసారమునకును వెల్తురుకును తగిన గవాక్షులు మొదలయినవి యుంచుకొని, వానిని తెరచియుంచుచున్నయెడల మంచిఆరోగ్యముగా నుండుటయేగాక ప్రసవాయాసము తత్సంబంధమయిన యితరబాధలు ఏమియు కలుగవు.

ఇంటి పరిశుభ్రతనుగూర్చి జాగ్రత పుచ్చుకొనవలసినవి మరికొన్ని గలవు. ఇంటిసమీపమందు దుర్వాసనగల పెంట పేడ మొదలగునవి లేకుండ చేసికొనవలయును. కొందఱు దుర్వాసనలకు ప్రతిక్రియగా కర్పూరము మొదలయిన సువాసనగల పదార్థములు దగ్గిరనుంచుకొని కాలక్షేపముచేయుదురుగాని అట్టివాసనలు ఎందువల్ల పుట్టునో ఆమూలములను పోగొట్టుకొనుటకు ప్రయత్నము చేయరు. గొప్పపట్టణములలో జలదారులలోను దొడ్లలోనను దినదినము పెరుగు అసహ్యా

ములను విముక్తి చేయించుకొనుచుండుట పరమావశ్యకము. అట్లు చేయనియెడల వాసనచేగిల్లు శరీరబాధమాత్రమే కాకుండ జాడ్యములుకూడ సంభవించును. జలదారులలోనుండియును వాకిళ్ళు మొదలయినవి కడిగినప్పుడు అచ్చటినుండియును బయలుదేరు మలినపునీళ్ళు నూతులలోకి దిగకుండ తగినంత జాగ్రత పుచ్చుకొనవలెను.

ఈరీతిగా దేహగేహములు ఎల్లప్పుడును మిక్కిలి శుభ్రముగా నుండులాగున చేసికొనుచున్న మంచిఆరోగ్యము కలిగియుండును. ఈవిషయము సర్వసామాన్యముగా అందరును గమనించవలసినదే. ముఖ్యముగా గర్భిణిస్త్రీలుకూడ ఇట్లు నడుచుకోవలసి యుండుననియు అట్లుజరిగించినయెడల వారికి చాలలాభములును జరిగించనియెడల చాలనష్టములును ఉండుననియు తెలియచేయుటకై యిచ్చట ప్రత్యేకముగా వ్రాయబడినది.

భోజనవిషయము.

గర్భిణిస్త్రీలు గర్భోత్పత్తియైన కొన్నిమాసములవరకు మితముగా భోజనము చేయుచుండవలెను. ఎందువల్లనంటే అధికభోజనమును బలుపైన ఆహారమును ఆసమయములో జ్వరమునుకలిగించును. మరియు మత్తతచేయు పదార్థములు పుచ్చుకొనకూడదు. విశేషముగా కారము తినకూడదు. తినినయెడల తల్లికిని గర్భమందున్న బిడ్డకును జబ్బుచేయుటయేకాక ప్రసవముకూడ మిక్కిలి కఠినముగా నుండును. ఆవాలు, మెంతులు, మిరపకాయలు, మొదలయిన కారపు పదార్థములు ఎంతవర్జించిన తల్లికిని గర్భములోనున్న శిశువునకును అంతమంచిది. గర్భిణిస్త్రీ గర్భమయిన కొంతకాలమువరకు విశేషముగా ఆహారము పుచ్చుకొనవలెననియు తనకుమాత్రమెగాక శిశువునకుకూడ కావలసియుండునుగనుక యథేచ్ఛగా భోజనము చేయవలెననియు కొందరందురుగాని అది యుక్తియుక్తముగాను శాస్త్రీయముగాను లేదు. ఎందువల్లననగా, గర్భమైనపిమ్మట బహిష్ఠయగుట నిలచిపోవును. కాబట్టి తద్వారా బలక్షీణతయేమియు తటస్థించదు. ఇంతేకాకుండ గర్భమయిన తరువాత కొంతకాలమువరకుమందముగాను జ్వరమువచ్చినట్లునుఉండును. జఠరశక్తితగ్గియుండును. ఈకారణములచేత మామూలు ఆహారముకంటె అధికముగా పుచ్చుకొనుట అనావశ్యకమును అనారోగ్యకరమునుకూడ నగును. ఇక శిశువునకు కొంత ఆహారము కావలసియుండుననుట కేవలము అసందర్భమైనమాట. ఎందువలననగా, మూడుమాసములవరకు గర్భములోని పిండము కోడిగ్రుడ్డుకంటె పెద్దదిగానుండదు.

శ్రీ

సూర్యశతకము.

ప్రభావర్ణనము.

స్రగ్ధరావృత్తమ్॥ జంభారాతీభకుంభోద్భవమివదధతస్సాంద్రసిందూరరేణుం।
రక్తాస్సిక్తా ఇవౌఘై రుదయగిరితటీధాతుధారాద్రవస్య।
ఆయాంత్యాతుల్యకాలం కమలవనరుచే వారుణావోవిభూత్యై।
భూయాసుర్భాసయంతో భువనమభినవా భానవోభానవీయాః॥౧॥

క॥ శ్రీవేదవ్యాసేశ్వర।
సేవక సేవధి, మయూరసిద్ధశతక సం।
భావిత వర్ణనఁ దెనుఁగుం।
గావించెద నవధరింపు కరుణఁదలిర్పన్॥

చ॥ తొలుదెస హస్తికుంభముల తోరపుఁ జెందిరపున్రజంబునన్।
బలె నుదయాద్రి సానువులభాసిలు జేగురుఁ జోటి వెల్లువన్।
బలె నప్రడోప్పనంబుజవిభన్ బలె నెఱ్ఱనిడాలుమీఱు వే।
వెలుఁగు వెలుంగుమీకు శుభవృద్ధి నిరామయసిద్ధిఁ జేయుతన్॥౧॥

స్ర॥ భక్తిప్రహ్వాయదాతుం ముకుళపుటకుటీకోటరక్రోడలీనాం।
లక్ష్మీమాక్రష్టుకామా ఇవకమలవనోద్ఘాటనం కుర్వతేయే।
కాలాకారాంధకారానన పతితజగత్సాధ్వసధ్వంసకల్యాః।
కల్యాణంవఃక్రియాసుః కిసలయరుచయస్తే కరాభాస్కరస్య॥౨॥

చ॥ అరసి, వినమ్రులౌ జనులకందఱకీ ముకుళాంతరాశ్రితన్।
సిరిఁగడుఁబల్మిఁ దేఁ, దలఁపుచేబలెఁ జేసెడు నబ్జభేదమే।
కరములు, పల్లవాకృతులు కాలతమోముఖపాతిలోక భీ।
హరణచణమ్ములార్కములవన్ని శుభమ్ములు మీకొసంగెడున్॥౨॥

సేవధి=నిధి. సంభావిత=మన్నింపఁబడిన.

సానువుల=చఱుల. నిరామయసిద్ధి=ఆరోగ్యలాభమును.

౨ (అందఱకన్) ఈన్=ఇచ్చుటకు, ముకుళాంతరాశ్రితన్=(తామర) మొగ్గల నడుమనున్న) అబ్జభేదము=తామర (మొగ్గ)ల వికాసమనెడు భాండాగారము యొక్క విఘటనమును, కరములు=కిరణములను చేతులు, కాలతమో...చణమ్ములు=యమునివంటి నల్లనిచీకటినోటఁబడిన జనులవెఱపు శిగించుటచేఁ బ్రసిద్ధములు, ఆర్కములు=సూర్యునివి.

స్ర॥ గర్భేష్వంభోరుహాణాం శిఖరిషుచశితాగ్రేషుతుల్యంపతంతః।
ప్రారంభేవాసరస్యవ్యుపరతి సమయేచైకరూపాస్తథైవ।
నిష్పర్యాయం ప్రవృత్తాస్త్రి భువనభవనప్రాంగణే పాంతుయుష్మా।
నూష్మాణం సంతతాధ్వశ్రమజమివభృశంబి భ్రతోబ్రధ్నపాదాః॥౩॥

చ॥ సరసిజగర్భసీమల, నిశాతధరాగ్రముల, న్మెలంగెడు।
న్సరిగను, విష్టపౌఘసదనప్రఘణాక్రమ సంప్రవృత్తము।
ల్నిరతపథిశ్రమంబుననొ నిర్భరతాపము లెవ్వి, వేగ, వా।
సరవిరతిన్సరూపములు సాకెడు మిమ్మవిబ్రధ్నపాదముల్॥౩॥

స్ర॥ ప్రభ్రశ్యత్యుత్తరీయత్విషితమసి సముద్వీక్ష్యవీతావృతీన్ప్రా।
గ్జంతూంస్తంతూన్యథాయానతను వితనుతేతిగ్మరోచిర్మరీచీన్।
తేసాంద్రీభూయసద్యః క్రమవిశదదశాదశాలీవిశాలం।
శశ్వత్సంపాదయంతోంబరమమలమలం మంగళంవోదిశంతు॥౪॥

చ॥ పయివలువట్టిచీక టులువాయబయల్పడు మందిఁజూచి ము।
న్దయ నినుఁడేమరీచులను దంతులు నానెసకొల్పు, నప్పుడే।
తయు నవిదట్టమై విమలతథ్యదిశాదశమంబరంబుఁజే।
సి యిడువిశాల, మయ్యవి, విశిష్టశుభంబులు మీకొసంగెడుఁ॥౪॥

స్ర॥ న్యక్కుర్వన్నోషధీశే ముషితరుచి శుచేవౌషధీః ప్రోషితాభా।
భాస్వద్గ్రావోద్గతేన ప్రథమమివకృతాభ్యుద్గతిఃపావకేన।
పక్షచ్ఛేదవ్రణాసృక్స్రుత ఇవదృషదోదర్శయన్ప్రాతరద్రే।
రాతామ్రస్తీవ్రభానోరనభిమతనుదేస్తాద్గభస్త్యుద్గమోవః॥౫॥

మ॥ గతకాంతిన్బతిదీప్తిమాయఁ గడుశోకంబందినట్లోషధీ।
సతి, ధిక్కారమొనర్చి, మున్రవిశిలా సప్తార్చి రభ్యుద్గతా।
యుతముల్గాఁదగి, ప్రాగ్నగాశ్మములఁ బక్షోచ్ఛిత్త్యరుశ్శోణిత।
స్రుతముల్గాఁగనఁజేయు తామ్రరవిఘృష్టుల్పాపముల్వాపెడున్॥౫॥

---

౩. ప్రఘణ=ముంగిలి, వేగఁ=ఉదయమున, పాదములు, కిరణములను కాళ్ళు.

౪. మరీచులు=కిరణములు, విమల=స్వచ్ఛము, తథ్య=సత్యము, దిశాదశము=దిక్కులను చెఱఁగులు కలదియు, అంబరంబు=ఆకాశమను వస్త్రమును.

౫. పతి=చంద్రుఁడు, సతిఁ=పతివ్రతను, రవిశిలా...ఆయుతములు=సూర్యకాంతములఁబుట్టు నగ్నియొక్క ప్రత్యుత్థానముతో నంతటఁగూడినవి, అరుస్=గాయములు.

స్ర॥ శీర్ణఘ్రాణాంఘ్రిపాణీ న్వ్రణిభిరపఘనైర్ఘర్ఘరావ్యక్తఘోషా।
న్దీర్ఘాఘ్రాతానఘౌఘైః పునరపిఘటయత్యేక ఉల్లాఘయన్యః।
ఘర్మాంశోస్తస్యవోంతర్ద్విగుణఘనఘృణానిఘ్ననిర్విఘ్నవృత్తే।
ర్దత్తార్ఘాస్సిద్ధసంఘై ర్విదధతుఘృణయశ్శీఘ్రమంహోవిఘాతమ్॥౬॥

మ॥ ముకుఁగాళ్ళేతులు ముక్కలై వ్రణములన్మస్ఫుటధ్వానమై।
వికలత్వంబునఁగుందు పాపులవతే వేల్పామయంబుల్దొలం।
చికడుంగూర్చు, మదిన్ప్రవృద్ధకరుణాశ్రీశాలిసిద్ధుల్సము।
త్సుకతం బూజలొనర్చు నారవిఘృణుల్దోషమ్ము మీదేర్చెడున్॥౬॥

స్ర॥ బిభ్రాణా వామనత్వం ప్రథమమథతథైవాంశవః ప్రాంశవోవః।
క్రాంతాకాశాంతరాళా స్తదనుదశదిశః పూరయన్తస్తతోపి।
ధ్వాంతాదాచ్ఛిద్యదేవద్విష ఇవబలినో విశ్వమాశ్వశ్నువానాః।
కృచ్ఛ్రాణ్యుచ్ఛ్రాయహేలాపహసితహరయోహారిదశ్వాహరంతు॥౭॥

శా॥ ఆదిన్వామనతన్భజించి, యటుదీర్ఘాకారముం జెంది, పై।
రోదస్సీమలువ్రాకి, యంతదెసలన్రోధించుచుం, దిగ్గురు।
క్త్పాదంబుల్హరిగేరునెయ్యవితమో బల్యాత్తవిశ్వంబులై,।
ఖేదంబుల్దెగునాహరిద్ధయవియత్ఖేలన్మయూఖాళిచేన్॥౭॥

స్ర॥ ఉద్గాఢేనారుణిమ్నా విదధతి బహుళంయేరుణస్యారుణత్వం।
మూర్ధోద్ధూతౌఖలీనక్షత రుధిరరుచో యేరథాశ్వాననేషు।
శైలానాంశేఖరత్వం శ్రితశిఖరశిఖా స్తన్వతేయేదిశంతు।
ప్రేంఖంతఃఖేఖరాంశోః ఖచితదినముఖాస్తేమయూఖాస్సుఖంవః॥౮।

చ॥ అరుణునినామమత్యరుణిమాప్తి, యథార్థతరంబుఁజేయునో।
శ్వరథహయాననోద్ధత ఖలీనపరిక్షతరక్తరోచి, భూ।
ధర శిఖరాళి, శేఖరతఁదాల్చెడునెద్ది, దినాదిదీప్తిమ।
త్కరనికరంబు మీకది సుఖంబులవారిగఁ గ్రుమ్మరించెడున్॥౮॥

---

౬. తొలంచి=తొలఁగించి,

౭. రోదస్సీమలు=భూమ్యాకాశప్రదేశంబులు, హరిన్=వామనుని, తమోబల్యాత్తవిశ్వంబులు=చీకటియను బలిచక్రవర్తివలన స్వీకరింపఁబడిన ప్రపంచముకలవి॥

౮. ఖలీన=కళ్ళెము,

ప్ర॥ దత్తానందాః ప్రజానాం సముచితసమయాకృష్టసృష్టైః పయోభిః।
పూర్వాహ్ణే విప్రకీర్ణా దిశి దిశి విరమత్యహ్ని సంహారభాజః।
దీప్తాంశోర్దీర్ఘదుఃఖప్రభవభవభయోదన్వదుత్తారనావో।
గావో వః పావనానాం పరమపరిమితాం ప్రీతిముత్పాదయంతు॥౯॥

మ॥ సమయాకృష్టవిసృష్టపుష్కలపయస్సంప్రీణితాత్మప్రజ।
మ్మమితాఘప్రభవద్భవాబ్ధికలము న్ప్రాహ్ణంచత్సవితాగ్రధిరా।
జము ప్రాహ్ణప్రతిదిక్ప్రకీర్ణము పునస్సాయం నివృత్తమ్ము గో।
సమజమ్ము ర్కుజమిచ్చుమీకమిత హర్షశ్రీప్రకర్షమ్ములన్॥౯॥

ప్ర॥ బంధధ్వం సైకహేతుం శిరసి నతిరసాబద్ధసంధ్యాంజలీనాం।
లోకానాం యే ప్రబోధం విదధతి విపులాంభోజషండాశయేవ।
తేయుష్మాకం స్వచిత్తప్రథిమపృథుతర ప్రార్థనాకల్పవృక్షాః।
కల్పంతాం నిర్వికల్పం దినకరకిరణాః కేతవః కల్మషస్య॥౧౦॥

మ॥ తలలందంజలి పట్టి సంజ, నతితాత్పర్యంబునం బట్టులో।
కులకు న్బంధహరప్రబోధమిడు, వ్యాకోచాబ్జషండాశచే।
బలె నంహోగణధూమకేతువులెవా భాస్వత్కరంబుల్ప్రహృ।
త్కలనానల్పమనీషితప్రతతికి న్కల్పాగముల్మీకగున్॥ ౧౦॥

ప్ర॥ ధారా రాయో ధనాయాపది సపది కరాలంబభూతాః ప్రపాతే।
తత్త్వాలోకైకదీపాస్త్రిదివపతిపురప్రస్థితౌ వీథ్యఏవ।
నిర్వాణోద్యోగియోగిప్రగమ నిజతనుద్వారి వేత్రాయమాణా।
స్త్రాయంతాం తీవ్రభానోర్దివసముఖ సుఖారశ్మయః కశ్మలాద్వః॥ ౧౧॥

మ॥ ధనతృష్ణాపద స్వర్ణధారలు ప్రపాతద్రాక్కరాలంబము।
ల్గనఁ దత్త్వంబు ప్రదీపముల్సురపలోకప్రస్థితిన్వీధులు।
న్దనువద్ద్వారముఁ జొన్ప వేత్రములు విద్వద్వ్రాతముం బ్రాతర।
త్యనుకూలాహిమరశ్మిరశ్ములు భవద్వ్యాధి వ్యథల్ప్రోల్చెడున్॥ ౧౨॥

ప్ర॥ ప్రాచి ప్రాగాచరంత్యో నతిచిరమచలే చారుచూడామణిత్వం।
ముంచంత్యోరోచనాంబు ప్రచురమివ దిశా ముచ్చకైశ్చర్చనాయ।
చాటూత్కైశ్చక్రనామ్నాం చతురమవిచలైర్లోచనైరర్చ్యమానా।
శ్చేష్టంతాం చింతితానాముచితమచరమాశ్చండరోచీరుచోవః॥ ౧౨॥

౯. పయః=పాలు, నీళ్ళును, ప్రజా=లేగలు, జనులును, గోసమజమ్ము=కిరణసమూహమును నావులమంద॥ కలము=ఓడ. ౧౦. కలన= గొప్పతనముంబట్టి. ౧౧. ప్రపాత=నరకమునఁబడుట. తనువు=సూర్యమండలము.

[సశేషము.] ఆకుండి - వ్యాసమూర్తిశాస్త్రి.

(౫౭)

GOD BLESS THE EMPRESS OF INDIA.

శా॥ శ్రీరంజిల్లెడు దివ్యచిత్రఘన సంశీతేంద్రజాలుండు లో।
కారాధ్యుండు నశేషభూతయుతుఁ డత్యంతప్రభావుండు స।
ద్వీరశ్రేష్ఠుఁడునైన యీశ్వరుడు శ్రీవిక్టోరియారాజ్ఞాలయన్।
గారుణ్యంబునఁ జక్రవర్తినిగ సింగారించె బంగారుగాన్॥౧॥

సీ॥ ఘనవంశమునఁ బుట్టి జనములఁ బాలించుచునుఁ బెనురాశియై తనరు నెవరు।
లండన్ కునండయై యిండియా నేలుచు దండిపూదండయై యుండు నెవరు।
ఎల్లరయుల్లముల్ చల్లనఁ జెల్లించె డుల్లాకుచే నుల్లసిల్లు నెవరు।
రాజపూజిత మహారాజసేవిత రాజజీవితంబగుచు రాజిల్లు నెవరు॥౨
అట్టిఘనురాలు విక్టోరియాను భువిని।
నెంప్రెసన్ యిండియాయందు నెల్లజనులుఁ।
బాగడునట్లుగఁ జేసెనా భగవదిచ్ఛ।
జయజయా దిగ్విజయ సర్వజయయటంచు।
దేవుడాశీర్వదించు నెంతేనుతించు॥౩॥

క॥ కరిపురమునఁ గరమరుదగు।
సరిదారవెల్లరులుఁ గుదురుసభశుభకరమున్।
భరమున్ ధరణికినియశ।
స్కరమున్నరనికరములకుఁ గమలాకరమున్॥౪॥

తే॥గీ॥ అట్టిపేరోలగమునుండు నవసరమున।
నఖిలభూతలసేతవిఖ్యాతపూత।
నవనిఫాలమాతదాజజనములయాత।
సరసఫలపుష్పభరితయు సకలరాజ్య।
భూషితయు సర్వసదాజ్యతోషితయును।
వివిధవిద్యాప్రపూరిత విమలచరిత।
గరితమరితరహితయు నాగరికతహిత।
మిగతభూములకొఱతకు మెఱుఁగుపూత।

సన్నుతాఖిల సంపత్సుసౌఖ్యజాత।
మైనహిందూధరేందిరకలరుచక్ర।
వతిఁ నిగఁ గీర్తివర్తిలె వసుధఁబూర్తి।
గాను రిపులెల్ల నార్తులై కనుచునుండ।
మిత్రులెల్లనుగూడి తన్ మెచ్చుచుండ।
ఖాబ్బహాద్దూ సెబాస్విరిగూడ్డునల్లై।
దాచిబహుమంచిదయపొళ్ళి దాయితటంచుఁ।
జెయ్యిఁ జెయ్యని నప్పళించెడి జనములఁ।
గూడియూడఁగఁ జూడఁగ గోరుమనము॥౫॥

క॥ స్వస్తి శ్రీవిజయంబని।
హస్తిపురమునందుఁ జేరునఁ దఱునిదియే।
సుస్థిరమగు నుతథాస్తని।
హస్తములనుఁ దట్టువారినచటగనవలెన్॥౬॥

తే॥గీ॥ పట్టణములకుఁ బాపటబొట్టు చెన్న।
పట్టణంబట్టి వానికిఁ బట్టుకొమ్మ।
రాజ్యలక్ష్మికిఁ గన్ను భూరమణిసొమ్మ।
యమ్మగోదావరీమండలమ్మనంగ॥౭॥

తే॥గీ॥ ఇందుఁ జెంపొందు రాజమహేంద్రవురము।
కాపురము రసికుల కలకాపురమునుఁ।
బోలునిచ్చటగూడు జనాలియోల।
గమ్మనాదిగవర్ణింతు సమ్మతముగ॥౮॥

నాటాదిరాగములతోఁటి యింగ్లీషుబ్యాన్డు వాయిద్యమునుం జేర్చి చదువవచ్చును.

నారికేళ చూతపున్నాగకదళిపత్రముల్।
మల్లెమొల్లజాజిచేమంతిబంతి చిత్రముల్।
వివిధసురభి కుసుమములును వేనవేలుదీపముల్।
తెలుకుమించుమించుగల్గు వేడ్కరాజరూపముల్॥
డంబుగల్గు ఫిరంగిలు ధాంధమిలటంచునున్।
సంచుగాంచు నెంచబాణసంచుఘుస్సటంచునున్ఁ।
ఘల్లుంఘిల్లుమటంచుఁ దంబురల్ మరిన్ భరంబుగాన్।

మ్రోయజయధ్వనులఁ జూడముచ్చటౌ తోరంబుగాన్।
సౌరు తీరుఁ గోరు దర్వారుబారు వారలుగాన్।
అదరుబారు లేకఁ జేరినట్టి సదురుకుదురుగాన్।
చూడఁ జూడ వేడుకయ్యెఁ జోడుఁ గూడు నేమొకో।
ఢిల్లి సభాలక్ష్మి ముద్దుచెల్లెలిదియు కాదొకో।
యంచు భ్రమనుఁ బుట్టించు నించుకేనిఁ జల్లగాన్।
మంచిదాయె నీసభయుమించి శోభిల్లగాన్॥

వ॥ మఱియు నమ్మహాజనసంకల్ప నిష్కలంకాలంకార సంకేత సంకీర్ణసంకీర్తనా సంకాశ సుప్రకాశంబునగు కరిపురవరంబునఁ గరఁబు భద్ర కరంబునన్ జరుగు పాలకడలిన్ దలమిగులు నమ్మహాసభకు శుభాంకంబంగు నీరాజమహేంద్రవరపురంబునం గలియ పేరోలగంబను మున్నీట నోలలాడు హిందూదేశ చక్రవర్తినీపట్టాభిషేకాభిరామ నామంబును వినినఁ గనిన నభిమాన మానవులు సుమాళంబునం దేలుచు- సొక్కుచు- నెన్నుచు- నుతించుచుఁ గలకాలం బీమేలుపలుకులిలాలలనకున్ గలకలంబై జయశీలంబున కాలవాలంబై యేలనుండకుండుననువారలయాశీర్వాదమంగళ వచనంబులన్ వినిన మేనం బులకలుంగలిగి బలుపుఁబోలుపుమిగిలి వలపునందేలుటకు సందియంబు వలువదు. ఈమహాభాగ్యశాలి యేలుబడికిన్ బాలుపడిన సమస్త వస్తు విస్తార సంభారభార మహోదార పారావారఁబగు మనదేశంబపార సౌఖ్య సంసారంబై ధూమశకట ధూమయానపాత్ర తంత్రివార్తాదియంత్ర తంత్రమంత్రసూత్ర ప్రయోజనంబులన్ స్వతంత్రంబునం గనుచు నదీనదంబుల కనకట్టలుంగలిగి గుట్టలుమిట్టలెల్లన్ గాలువలై కాలువలెల్లన్ గాపులకున్ గాపులై లాతివిలాతులకున్ జను జనులకున్ గోపులై కంటకారణ్యదుర్గంబులు సంకటరహిత విహితమార్గంబులై సకలవిద్య లెల్లరకువేద్యంబులయి వెలయుచు మిక్కిలి నాగరికతనెక్కొనం జేయుచుండుటాదిగగల మహోపకారంబులెల్లరకున్ దెల్లంబేకదా జీవనవరత్నంబులన్ గాంచి రత్నాకరుండలమీరి సిరియు సంపదలచేఁ దలఁదూగి తామరతంపరవిధంబునం గుటుంబంబల్లిబిల్లిగ నల్లికొన మహోన్నత ఘనతనొందుచుండు మన చక్రవర్తినీగారికి వంశాభివృద్ధియును రాజ్యసమృద్ధియు నిష్టసిద్ధియు నొసంగి సర్వేశ్వరుండు రక్షించున్ గాతా యనికాంక్షించుచుండెడి

చిలంబి - ఆదినారాయణప్ప.

మఱియును ఘనతఁజెందిన మనయెంప్రెసఫ్ యిండియాగారి ప్రథమపుత్రులును మనయువరాజుగారునగు హిస్ రాయల్ హైనెస్ ది ప్రిన్సఫ్ వేల్సుగారీహిందూదేశ సందర్శనాధికార సంచారంబొనరించియు నించుకేని నేలోపముఁ గలుగక స్వదేశప్రదేశ ప్రవేశంబు గలుగుటకును మాతృసందర్శనానందంబుచేఁ జెలంగుటకును మరువత్సరంబున మనక్వీన్ విక్టోరియాగారు హిందూదేశ చక్రవర్తినియను యరుదగు బిరుదుం గాంచుటకును నాచేరచియింపఁబడిన ప్రిన్సఫ్ వేల్సు హిందూదేశ సందర్శనంబను మదీయసన్మంగళగ్రంథమాహాత్మ్యంబ కారణంబని తలంచెద. ఆగ్రంథంబు నిందు ముందు ముద్రింపించ నిరీక్షించుచుండెడి.

చిలంబి-ఆదినారాయణప్ప.